కీర్తిశేషులైన శ్రీ కందుల శ్రీమన్నారాయణగారిచే స్థాపింపఁబడియె.

సంపుటము. II | నవంబరు. 1912. | సంచిక. 7.

# మానవసేవ.

మత సంఘ పరిశ్రమ భాషావిషయములఁ జర్చించు

## సచిత్ర మాసపత్రిక

రాజమహేంద్రవరము

పత్రికాసంపాదకులు

నాళము కృష్ణారావు

సత్యవోలు అప్పారావు.

సత్యవోలు అప్పారావుచే
శ్రీవిద్యానిలయ ముద్రాశాలయందు
ముద్రింపించి ప్రకటింపబడియె.

రాజమహేంద్రవరము.

1912.

# విషయములు

## I. పద్యములు.


1. ఆనందశతకము — నూరాబత్తుల సూర్యనారాయణగారు.

2. ఆర్యసూక్తిముక్తావళి — సత్యవోలు అప్పారావుగారు.

3. మీరాబాయి — రాళ్లపల్లి అనంతకృష్ణశర్మగారు.


## II. సారస్వతము.


4. పున్నాబాయి — సత్యవోలు అప్పారావుగారు.

5. ప్రభావతి — నూరాబత్తుల సూర్యనారాయణగారు.

6. హేలావతి — తల్లాప్రగడ సూర్యనారాయణరావుగారు.

7. కురుపాండవదాయభాగవిమర్శనము — కవిరాజ శ్రీపాద కృష్ణమూర్తిశాస్త్రిగారు

8. భాసమహాకవి — మానవల్లి రామకృష్ణకవిగారు. ఎమ్. ఎ.


## III. మతము—సంఘము.


9. బాబానానకు జీవితచారిత్రము — ఇ. సుబ్బుకృష్ణయ్యగారు.

10. బ్రాహ్మమతము — పాలపర్తి నరసింహముగారు.

11. బ్రహ్మసమాజచరిత్రము — పులవర్తి వేంకటసుబ్బారావుగారు.


## చిత్రపటములు.


బాబా గురునానకు.

శ్రీఛత్రపతి శివాజీచక్రవర్తి

శివాజీ తనచే బట్టుబడినస్త్రీని విడిపించుట.

# రాజపోషకులు

1. శ్రీరాజా రావువేంకటకుమారమహీపతి సూర్యారావుబహద్దరువారు.
2. శ్రీరాజా నాయని వేంకటరంగారావుబహద్దరువారు. మునగాల.

# పోషకులు

1. శ్రీయుత శ్రీకొవ్వూరి చంద్రారెడ్డిగారు, జమీందారు, నిడదవోలు
2. ,, శ్రీకలిదిండి వేంకటరామరాజుగారు ,, ,,
3. ,, తమ్మన మాణిక్యముగారు ఏలూరు.
4. శ్రీరాజా కాళేపల్లి అచ్యుతరామయ్య బహద్దరుగారు. యాదవోలు.
5. ,, శ్రీమోతే గంగరాజుగారు, జమీందారు. ఏలూరు.

# అభిమానులు

1. శ్రీయుత అద్దేపల్లి లక్ష్మణస్వామిగారు. ఏలూరు.
2. ,, శ్రీఉయ్యూరు మైనరు జమీందారుగారు. చెన్నపురి.
3. ,, చుండూరు శ్రీరాములుగారు. ఏలూరు.
4. శ్రీరాజా వెలుగోటి ముద్దుకృష్ణయాచేంద్ర బహద్దరువారు వేంకటగిరి.
5. శ్రీయుత డి. పానకాలరావుగారు. కోయంబత్తూరు.
6. ,, రావుబహద్దరు రఘుపతి వేంకటరత్నముగారు. కాకినాడ.
7. శ్రీరాజా బులుసు సర్వారాయుడు బహద్దరుగారు. కపిలేశ్వరపురము.

# చందావివరము

| | | |
|---|---|---|
| చందాదారులకు | వత్సరమునకు | రు 3 |
| అభిమానులకు | ,, | 5 |
| పోషకులకు | ,, | 10 |

రాజపోషకులయాదరణము వారియనుగ్రహాధీనము.

మాదిరిపత్రిక వలయువారు 4 అణాలపోష్టుబిళ్ళలు బంపవలయును.

# ప్రకటనపద్ధతి

| | పుటకు. | | | అరపుటకు |
|---|---|---|---|---|
| వత్సరమునకు | రు 30 | ... | ... | రు 18 |
| అర్థవత్సరమునకు | 18 | ... | ... | 10 |
| మూడుమాసములకు | 10 | ... | ... | 6 |
| మాసమునకు | 3-8 | ... | ... | 2-8 |

శా. సామీప్యంబునఁ జేరి పుత్త్రికుఁ డపేక్షన్ వీడకే నేఁడునో
నామారామును దీర్చుతల్లిగతి ని న్నాశించి యేవేళలన్
నీమం బొప్పఁగఁ గొల్చి కోరువరముల్ నిశ్శేష మానట్లుగా
నామోదంబున నిచ్చి కావఁగదవే యానందతేజోమయా!

మ. తినుచున్ మూర్కొనుచున్ ధరించుచును వృద్ధిన్ బొందుచున్ జూచుచున్
వినుచున్ సౌఖ్యము నొందుచున్ మురియుచున్ విజ్ఞానహీనుండు తాఁ
దనియున్ నిత్య మటంచు నమ్మి, యది నిత్యం బైనయానందమా?
యనువర్తించిన మంచికర్మయె సుఖం బానందతేజోమయా!

శా. నీసృష్టిం గలనారికేళతరువే నీర్వట్టునన్ బెంచినన్
వేసంగిన్ బ్రజకోర్కె దీర జలతృప్తిం జేయుచుండెం గదా
గాసిం జెందినవారు నిన్ గొలువ నీకారుణ్య మింఁజాల వే
లా? సంతృప్తిని జేసి కావఁ గదవే యానందతేజోమయా!

మ. చెవులున్ గన్నులు పాటవం బుడిగినన్ క్షీణించినన్ రక్తమున్
జవసత్వంబులు రూపు మాసినను వీసంబేనియున్ మార్పుఁ జెం
దవు లోభంబును కామమోహములు క్రోధం బింక వేళ్ళూని; యీ
యవయోగరబును మాన్ప నిన్ గొలతు నే నానందతేజోమయా!

శా. నీమం బై చెడు నంచు నెంచి సుతునిన్ నిత్యంబు జాగ్రత్తతోఁ
జూచున్ సత్పథమందుఁ ద్రిప్పఁ బిత; యాజోకన్ బ్రమత్తుండ నై
యేచిక్కున్ బడకుండ నుండుటకు సద్వృత్తిన్ బ్రసాదించి యి
మ్మాచంద్రార్కము నిన్నుఁ జేరి మననా నానందతేజోమయా!

మ. ఎర యంచున్ గబళించి గాలమున మీ నేరీతిగాఁ జిక్కెన
ట్లరయన్ బ్రాజ్ఞతలేమి నొందుచును నే నాశింతు నేకృత్య మే
దురితం బైనను నందునన్ జెడుదు నిర్దోషంబుగాఁ ద్రిప్పుమా
హరువౌమార్గమునందు మేలు గన నే నానందతేజోమయా!

శా. న్యాయంబందున దృష్టి గల్గునరులే యాపత్తులన్ మున్గఁగా
హేయం బైనయకృత్యముల్ నెఱపువా రేకష్టమున్ బొంద; రీ
వేయుద్దేశముచేతఁ జేసితివొ యీయేర్పాటు లిరీతి న
న్యాయంబౌ నిది తీర్చి కావఁ గదవే యానందతేజోమయా!

మ. అనుమౌకోకిలకూజితంబులను దా మాలించి కాకంబు లో
ర్వనిరీతిన్ నిను మోక్షదాయకుని భావంబందుఁ జింతించువా
వెనువెంటన్ విషయాళి చుట్టుకొని న శ్వేవించు మాన్పింప; నీ
యనరున్ బాపుము నిన్ భజింతు శుభ మా నానందతేజోమయా!

శా. ప్రేమించున్ సుఖమన్నఁ, గష్టమనినన్ బెగ్గిల్లు నామానసం
బేమో? సైఁపఁగఁ గల్గఁ గష్టము సుఖంబే యౌర యభ్యాసికిన్
సామాన్యంపువిపత్తు లోర్వఁగలయోజన్ మాకు నేర్పింపవే
యామార్గంబున వచ్చి చేరుదుము ని న్నానందతేజోమయా!

మ. బలమున్ విద్యయు బుద్ధి కౌశలము సద్భావంబు సంపత్తియున్
గలవాఁ డయ్యును కార్య మూనుకొన నీకారుణ్యమే లేనిచోఁ
దొలఁగున్ సాధ్యము గాక యం చెఱిఁగి నీతోడ్పాటుకై కొల్తు న
న్నలయం జేయక తోడునీడ యగుమా యానందతేజోమయా!

శా. నాతండ్రీ! గుణ మెంచఁ బోక సతతం బాసక్తితో స్వాంత మెం
తో తుచ్ఛం బగుకోర్కె గోరి విడ; దాదుర్బుద్ధి మాన్పించి యే
లా తెల్లంబుగ మేలుకీడులను దెల్పం జూడవో దినర
క్షా! తప్పున్ సవరింపు పూర్ణముగ నోయానందతేజోమయా!

మ. చిలుకల్ పుష్పితశాల్మలిన్ గని భ్రమన్ జేరంగ నం దేమియున్
ఫలముల్ చేపడకుండినన్ విడువకే వర్తించునారీతి నే
నిల భోగంబుల నమ్ముచున్ విడువలే నేమోస మేతెంచునో

# ఆనందశతకము.

శా. ఓభవ్యాత్మక! నీదునామభజనం బొప్పారఁగాఁ జేయుచో
శోభించున్ గడజాతివాఁ డయినఁ దేజోమాననీయాత్ముఁడై
నీభక్తిప్రభ నీచబుద్ధిఁ గడపన్ నిక్కంబు ముమ్మాటికా
నాభాగ్యం బిడి చేరఁ దీసికొనవే యానందతేజోమయా!

మ. పడిగాల్రిన్ జనుదూది యైనఁ దుద కేపార్శ్వంబునందో క్షితిన్
బడురీతిన్ మనుజుండు కర్మవశతన్ వర్తించుచుం దానునే
పడయున్ నీచఁపుజన్మ మట్టిగతి మాన్పన్ ద్రిప్పి రక్షింపు మే
యడలున్ గల్గఁగనీక నిన్గొలతు నే నానందతేజోమయా!

మ. ఘనుఁడౌ దేవుఁ డొసంగు ముక్తి యని దుష్కార్యంబులన్ జేసి యే
పున నామాన్యుని గొల్వ లాభ మగునా? పొందంగ సద్వర్తనన్
దనయంతం గృషి చేయ సాయపడి మోదం బొప్పగా వాంఛితం
బనుసంధింతువు గాని యూరక కిడుదే? యానందతేజోమయా!

# అభిప్రాయములు

రాజమహేంద్రవరమందుఁ బౌరపాఠశాలలో వ్యాయామశాస్త్రబోధోద్యోగమూనందు నున్న మ॥ శ్రీ॥ మూరాబత్తుల సూర్యనారాయణగారు రచియించిన శతకములలో నానందశతకము పరిశీలించి చూచినాఁడను. వీరు బాల్యవయఃప్రభృతి కవితారచనయందు నభిరుచి గలిగియున్నవారు. సర్వదా పండితాశ్రయణతత్పరులై వర్ధమానచంద్రస్థితిని వర్ధిల్లుచున్నవారు. కావుననే వీరు భక్తిజ్ఞానవైరాగ్యములను బోధించునట్టియీపొత్తంబును నింత సరసంబుగా రచించుటకుఁ గారణం బని నేఁ దలంచెదను. ఇంచుమించుగా నిందలి ప్రతిపద్యంబును లోకానుభవప్రసిద్ధంబైనదృష్టాంతంబులతో నిండియుండి యుపమాద్యలంకారంబుల భూషింపఁబడి యున్నది. ఇయ్యది చదివినచదువరులకు నానందమ్మును గలిగించుచు భక్తిజ్ఞానవైరాగ్యమార్గత్రయంబును గరతలామలకంబుగఁ గనఁబఱచు ననుట కొంతమాత్రమును సందియంబు లేదు. రచనాశైలి సమస్తజనులకును సుబోధం బగునట్టులు శోభిల్లుచున్నయది. కాఁబట్టి సదుపదేశంబులకుఁ గోశాగారం బైనయీకోశము సజ్జనసమాదరణీయం బై యుండు నని నే నెంచెద.

రాజమహేంద్రవరము<br>12 అక్టోబరు 1912

కల్లూరి వేంకటరామశాస్త్రి<br>ఆర్ట్సుకాలేజీ, ఉభయభాషాధ్యాపకపండితుఁడు

ఆనందశతకము—ఇది రాజమహేంద్రవరము టౌన్‌స్కూలునందు వ్యాయామశాస్త్రోపాధ్యాయుఁడుగా నున్న శ్రీ మూరాబత్తుల సూర్యనారాయణగారిచే మృదుమధురశైలిన్ రచింపఁబడిన నీతి, భక్తి, జ్ఞానశతకములలో నొకటి యగు భక్తిశతక మై ప్రతిపద్యరసాస్పద మై తనరారుచున్నది. ఇందు నేనేని కొన్ని స్వల్పదోషము లున్నను బెక్కుపద్యములు స్తోత్రపాత్రము లై పాఠకులన్ భక్తిపరవశులం జేయఁ జాలు నని తలంచెదను. ఇటీవలలో సరసకవితాధురంధరులు కొందఱిట్టి శతకములు కొన్ని రచించి యున్నవారు. అట్టిప్రౌఢకవులగ్రంథముల కీబాలకవిగ్రంథ మెందును దీసిపోవక మిన్నయై యున్న దని వ్రాయుట కెంతయు సంతసించుచుం బరమేశ్వరుఁ డీయన కాయురారోగ్యము లొసంగుఁ గాత—

మ. నిగమంబుల్ వినుతింపఁ జాలవు గదా నిక్కంబుగా నీకథన్<br>
జగతీచక్రములోనిపండితులకున్ శక్యంబె వర్ణింప నేఁ<br>
దగ నం చెంచక చెప్పఁ బూనితిని నాతండ్రీ! యుపేక్షించి త్రో<br>
యఁగఁ బో కజ్ఞుఁడ నన్నుఁ బ్రోవఁ గదవే యానందతేజోమయా!

అని ప్రార్థించు సుజనవిధేయుఁడు<br>
శ్రీపాద కృష్ణమూర్తిశాస్త్రి.

సీ. కోట యేమఱక కప్పుఁ బాటించి గడ్డియు ఘాణంబుఁ గొల్చును గట్టియలును
నేయు నూనియయును నాయుధమ్ములు నౌషధములు నాభీలయంత్రములుఁ గూష
ములు లోనుగా నందు వలయువాని సమగ్రములుగ సంపాదించి భూరిధైర్య
శౌర్యాదిగుణముల నడి సన్నయాప్తయోధులఁ బెల్లనుప్పట యలఘునీతి
పగతుఁ డలిగి నడచుపథమునఁ దృణకాష్ఠములును ధాన్యతోయములును లేక
యుండఁ జేసి మిత్రమండలేశుల నెత్తి యరుగుదేరఁ బనుచునది విభుండు. 244

మ. అరయుం దప్పు కృశం బెఱుంగు మదిలోభాలేశమున్ లేదను
ష్కరుఁ డాత్మస్తుతి లేదు సేయు నియతిం గార్యంబు లీగుల్ ఘన
స్థిరముల్ శూరుఁడు గర్వి గాఁ డశఁడు దుస్త్రీలోలుఁ డక్రోధనుం
డరి నొవ్వం గొనఁ డన్యగడ్డ గనురా జత్యంతదీప్తుం డగున్. 245

క. పరుసఁదనము మెయి నరిఁ గొనఁ। జొరఁ దగ దది పొదుఁగుగోయుచొప్పగు వినుపా
ల్గురియింపకొనఁ దలంచిన। నరయ వలదె గోవుఁ బ్రజయు నట్టిద యధిపా. 246

ఆ. కోరి తోఁటవాఁడు కుసుమఫలంబులు। గోయునట్లు రాజు గొనఁగ వలయు
వనంబు నఱికి యంగారములు సేయు। భంగి దైన భూమి పాడు గాదె. 247

క. రసగంధాద్యనుభవములు। పొసఁగవు భీత మగుచిత్తమున భయమునం బా
ప సమర్థుఁడు గావున నృపుఁ। డసమానప్రభుతఁ బొందు నవనీనాథా. 248

క. పరిశుద్ధి లేనిపత్నిత। పురోహితులు నీచదశలఁ బొందుదురు మహీ
వర యల్పమె శుద్ధుం డై। పురోహితత్వంబు సేఁత భూపతినగరన్. 249

క. ఆరోగ్యము గలయుత్తముఁ। బౌరోహిత్యంబు నడపఁ బనుచునది ధరి
త్రీరమణుఁ డతఁడు దాను స। మారంభము లెల్ల నేకమతిఁ గను టొప్పున్. 250

ఉ. మన్ననకున్ మదింప కవమానము వచ్చిన క్రుక్కి కోర్కిభం
గి న్నెలిఁ గార్యముల్ విగతకిల్బిషుఁడై తగఁ జేయునట్టిమి
త్రు న్నరనాయకుండు దనయూపుగ నగ్గల మైనశ్రీయు న
త్యున్నతియున్ ఘటించి మహిమోజ్జ్వలుఁ జేత సుఖావహం బగున్. 251

తే. తనకు మేలొనరించునాతండు మిత్రుఁ| డతఁడు నడపంగ నెల్లకార్యములు శుభము

నొందు నేమిట నేమఱకునికితోడ| నృపుడు మిత్రుపైఁ గార్యముల్ నిలుపవలయు.

క. బలఁగము గలభూపాలుఁడు| గెలనిమహీశ్వరులబుద్ధికిని వ్రేఁగగుచున్

బలియుఁ డగు లేనివానిం| జులకనగాఁ జూతు రెట్టి శూరుం డైనన్. 253

క. ఎక్కువతక్కువమాటలు| నుక్కివములు నెందుఁ గీడు నొందించుటయుం

జెక్కుడనయన్నదమ్ముల| దిక్కున నన్నియును సైఁపఁ దేజము సేయున్. 254

క. లోపల రాఁజుచుఁ బొగయుచుఁ| బాపంబులు దఱఁతు రోపి బలిమియు నెఱపుం

జూపక తక్కరు కెలనికి| నేపాటను వారి నడపు లెంతయు నొప్పున్. 255

క. మృదుమధురవాక్యముల నిం| పొదవెడుచిఱునవ్వుతోడ నుర్వీశుఁడు స

మ్మదము సచివులకుఁ బ్రజలకు| నొదవింపఁగ వలయు నది మహోన్నతిఁ జేయున్

క. నఱకుట యర్థముఁ గొనుటయుఁ| జెఱ ననుచుట కట్టి యడిచి చేడ్పా టొందం

బఱచుట మొదలుగఁ గలపలు| దెఱఁగులఁ దగు మెయిని నడపు ధీరవిచారా. 257

క. తనకడకు వచ్చి మొగ మో| డనివాఁ డగుదూత వల్కుటకుఁ గోపింపం

జనదు జననాథునకు దూ| తునిఁ జంపిన నరక మగుట ధ్రువ మని రార్యుల్. 258

తే. కులము శీలంబు హితవాక్యములును నేర్పుఁ| గార్యవాదిత్వసద్వచోగౌరవంబుఁ

దలఁపు గలుగుట దక్షత యలఘుగుణము| లందు రీ దూతకు నియ్యెడు నార్యజనులు.

క. మొన దీర్చువెరవు యంత్రము| లనేకము లొనర్చునేర్పు నాయుధముల వి

న్నను వును బోటులకర్జం| బును సేనాపతికి నైజములు గా వలయున్. 260

క. తనయుల నైనను నమ్మిన| జనపతి సిరి గోలుపోవుఁ జతురత్మై న

మ్మినవాఁడపోలె నమ్మక| యునికి సకలజనులయెడల నుర నై యుండున్. 261

క. చోరులచేఁ జెడ కుండం| గ్రూరులచేఁ జావ కుండఁ గువలయజనులన్

జారులచేఁ బడ కుండ ధ| రారమణుఁడు నేర్పు గలిగి రక్షింపఁ దగున్. 262

క. అవు బేహారముఁ గృషియున్| సవరణలును బసులసొంపు సరి యట్లగుటన్.

భువి బలుసు గలుగుకాఁపుల| నవనీశుఁడు గన్నప్రజల యట్లరయఁ దగున్. 263

క. అరి మిగులఁ గొనుట గోపులఁ। బొరిమాలఁగఁ బిదికినట్లు భూవర కదుపుల్
నెరవునఁ బెనిచినయట్లగు। నరపతి ప్రజచేత నప్పనము దగఁ గొనినన్. 264

క. విను కర్షకులును వణిజులు। ననఘా గోరక్షకులు ధరాధీశునకున్
ధన మొడఁగూడెడు వోటులు। కనేకవిధములకు నెల్ల నాద్యస్థలముల్. 265

తే. ధనములకు ధాన్యములకు నుత్పత్తి తలము। లయినవాని కించుకయును హాని గాక
యుండఁ దనపను బండార మొప్పఁ దగును। పాలనము సేయ వలయు భూపాలకుండు

క. పులి గూనలఁ దినునందము। గలిగిన నంతటన నిలుదుఁ గాక ధనంబుల్
గలుగునె మీఁదం గావున। జలగ దిగిచినట్లు గొనఁగఁ జను నిల సొమ్ముల్. 267

క. అరయుటఁ బ్రజ వర్ధిల్లఁగ। నరి యేఁటేటఁ గ్రమవృద్ధి యానట్టులుగా
నరపతికిఁ గొనఁగ వచ్చు। న్వైరవునఁ బెంపంగఁ జాల నెఱయు ధనంబుల్. 268

క. దమియింపఁ దగినవారల। సమయమున దమించి వారి సంపదలు మహీ
రమణుండు దనదుబండా। రముగా సమకూర్చు జనము రాగిల్లంగన్. 269

క. ఆపనికిఁ గీడు తోఁయుచు। భూపాలుఁడు ధనము గలుగుపురుషులసిరిఁ దాఁ
జూపోపక కొనఁదగదు ద। యాపరుఁడై పెంప వలయు నఖిలజనములన్. 270

క. ఆయతి కిమ్మెయిఁ గలుగును। పాయంబులు ధర్మమార్గఫలితంబులుగాఁ
జేయుటయు మేలు నృపతికి। మాయాకృతినిపుణుఁ డగుట మతి గాదు సుమీ. 271

తే. భూతవృద్ధులు ధనలాభములును గలుగు। ధర్మమునను రాజనువాఁడు ధర్మరక్ష
కై జనించెను గావున నతఁ డరోష। కాముఁడై ధర్మనిరతుండు గాఁగ వలయు 272

మ. పరనారీగమనాదిదోషములు భూపాలుండు సేయంగ న
ద్ధరకున్ వర్షము లేక యుండుఁ బ్రజకున్ దైన్యంబు వాటిల్లుఁ బె
క్కురుజల్ పైకొను నెందునుం గలయ నుక్కుం దేజముం దక్కు ను
ద్ధరసైన్యంబుల శత్రు లొత్తుదురు బంధుశ్రేణికిం జేటగున్. 273

క. కాని చెయిదములు సేయక। నూనధర్మమునను నడచునుర్వీశుఁడు సం
తానము బంధులుఁ బ్రజయును। దానును సేనలును శుభము దలకొనఁ జేర్చున్ 274

ఆ. అష్టసిద్ధికంటె నరయ నెక్కుడు ధర్మ। సిద్ధి దాన సకలసిద్ధులును బ్రి
శస్తభంగిఁ జేరు శాశ్వతకీర్తియు। సంభవించుఁ గలుగు సద్గతియును. 275

క. ధనమునకై ధర్మముఁ దెస। ననాదరము సేసె నేని నానృపతికి న
ద్ధనమును జెడు దుర్యశముం। బనుగొను మఱి దుర్గతియును వాటిలు ననఘా. 276

క. ధర్మప్రవృత్తి యయ్యును। ధర్మము నా కింతకంటెఁ దత్త్వఫలం
బేర్మిం బొరయ వలయు నను। ధార్మికతాత్పర్య నత్యుదాత్తుఁడు వొందున్. 277

క. మూలబలము సంతుష్టం। బై లాలిత మగుచు నున్నయప్పు డసదుచో
టాలోకించి నడవ భూ। పాలకునకు దండ మతిశుభం బొనరించున్. 278

చ. సమరము సాహసం బధికసంపద లక్ష్మియుఁ దెచ్చికోలు ప
థ్యమె రిపు లేల కల్గును రహంకృతి పెంపును నుత్కటంపుఁగో
పము మగిడింపఁ జాలునరపాలున కట్లగుటన్ హితంబు సా
మము దనయంతవాఁ డయినమానవనాథు నెడన్ మహీశ్వరా. 279

క. తనభటులు గలఁగినప్పుడు। ధన మిచ్చి విరోధి నల్పతరుఁ డైనను శాం
తునిఁ జేయ వలయు దానము। నన యధికునిఁ జేర్చు టురవు నరపతి కెపుడున్. 280

క. విను చిల్ల యుడిన యాయుధ। మును విగలిస్త మగుశస్త్రమును నెట్టియమి
త్రునిపై నైనఁ బ్రయోగిం। చిననరపతి నరకమున వసించు నృపాలా. 281

క. శరణాగతుఁ గాచియు నని। నరిపోటులఁ బడ్డఁ దెచ్చి యరసియు ధరణీ
సురలం బోషించియు నానా। ధ్వరములు సేసియును రాజు దలఁగు దురితముల్. 282

క. చవులఁ బనిచి యరుల తెఱం। గరయుము వా రెదురు నడచునట్టి దయిన దే
వ్వరపుం దెరువున దప్పిం। బొరసినయెడ విడియువోట బోడుమ టురవగున్. 283

ఆ. నిదురవోవుచోట నీరుద్రావెడువోటఁ। గూడు దినెడువోటఁ గొడకి సొలసి
నపుడుఁ జెవరి యున్నవనసరముఁ బగ। వారిఁ బొదివి చెఱుప వలయు నధిప. 284

తే. ఏను గేనుఁగుఁ జేర్చిన ట్లెసక మెసఁగు। నంగముల పెంపుఁ బులికిని సింగమునకుఁ
బుట్టినట్టియుఁ గ్రియను గట్టి మెఱయు। వలను గలయోధవీరుల వలయు ననికి. 285

క. సైనికులమనము లుత్సా। హోన్నతము లగుచు నుండ హయహేషణముల్
వీనులకును సొగయింపఁగ। జానికము లుబ్బ విజయ మగు సైన్యమునన్. 286

తే. టక్కు నేఁ జెప్పినను మీరు నిక్కమనియె
నమ్మఁదురు గాదె! యాదేశమ్ములోన
సంజపొద్దులఁ గాంచిన జనసమూహ
మినుము పైచిన రాలక యొసఁగి యుండు. ౨౦

ఉ. వత్తురు దేశదేశములవారు ముదంబున నామెగానముం
బెత్తురు, పట్టువస్త్రములు మేలిమిసొమ్ము లుపాయనంబుగా
నిత్తురు భామినీమణికిఁ, గృష్ణపదాంబుజభక్తియుక్తికిం
జిత్తమునందు విస్మయముఁ జెంది నుతింతురు మాటిమాటికిన్. ౨౧

తే. భక్తిరస ముట్టిపడు నామెపాట విన్న
బౌద్ధచార్వాకజైనకాపాలికాది
జనులు గూడ ముకుందునిచరణభక్తి
నెగడి రన నాసతిని వేఱ పొగడవలెనె? ౨౨

తే. వేయు నేటికి! నా దైవవిపులభక్తి,
నాకవిత్వంబు, నట్టిగానామృతంబు,
నట్టిచక్కఁదనముఁ జూచి యఖిలజనులు
దివ్యసతి యని యెంతు రా తెఱవ మిన్న ౨౩

ఉ. ఏనును నాసతీమణియహీనయశంబును వించు నెట్టు ల
మ్మానినిఁ జూడఁ గల్గుదుఁ జుమా? యని కౌతుక మొప్ప నెంతయుం
బూనిక మైఁ జితోడునకుఁ బోయి సతిన్ గనులారఁ గంటి, నా
గానము వింటి, ధన్యములు కన్నులు వీనులు నంటి నేఁటికిన్. ౨౪

తే. ఎన్నిదినములు విడక యయ్యన్న మిన్న
దర్శనముఁ జేయుచున్నను దనివి సనక
మరలి యటనుండి వెడలి రా మనసు రాక
యిన్నినాళ్లును నచటన యున్నవాఁడ. ౨౫

చ. తుద మది డాయిఁ జేసికొని, తోడన తన్నగరంబు వీడి, యా
సుదతులమిన్న నే తలఁచుచుం మది, దేశములోనివింతలన్
బడఁపడి చూచువేడుక మనమ్మున మీఱఁగ నెల్లచోటులుం
వదలక మెట్టికొంచు నొగి వచ్చితి నిన్నగరంబుఁ జూడఁగం

ఉ. ఎన్నియొ క్షేత్రతీర్థముల నెన్నియొ వేల్పుల నెన్నికోటులం
దెన్నివిధంబులం గనిన నేమివిచిత్రమొ, కాని నాకు న
య్యన్నులమిన్న మానస మొకప్పుడుఁ బాయద యేమి సెప్పుదున్!
గన్నులఁ గట్టినట్లు కలఁ గాంచిన నాయమయే కనంబడున్ 28

చ. ఇఁక నొకసారి యిట్లయిన నేఁ జని యాసతిదర్శనంబుఁ గం
డ్లకఱవు దీఱఁ జేయఁగఁ దలంచితి, మీ రెవ రైన నాకుఁ దో
డు కలిగినం బ్రయాణముఁ గడున్ వడి రేపె యొనర్తుఁ, దామసిం
పక చనుదెండు, నే ననినపల్కులనిక్కము తెల్ల మయ్యెడున్" 29

క. అని యాగోసాయి ముదం
బునఁ జెప్పినయాచరిత్రముల్ విని వారె
ల్లను విస్మయ మెంతయు మన
మున మీఱఁగ ననిరి కుతుకమున నాతనితోన్. 29

క. "తప్పక వత్తుము మేమును
నప్పరమపవిత్రచరిత నాలోకింపన్
జెప్పుఁడు ప్రయాణమును మన
మెప్పుడు సేయ వలె, నగునె యెల్లిరొ చెపుఁడా?" 30

వ. అనిన నతం డించుక నగి 31

ఉ. వారలతోడ ని ట్లనుచుఁ బల్కె "ని దేటికి సంశయంబు? సం
సారము వెంట రావలెనె? చాలును, బోవఁగ నిశ్చయించుచో
నూరక కాలముం గడప నొప్పదు, వెళ్ళుద మెల్లియే" యనన్
వారును సన్తె నిశ్చయ మొనర్చిరి ప్రొద్దున లేచి పోవఁగన్ 32

ఉ. అప్పుడె యన్యభూపతిరహస్యము లెయ్యవి యైననున్ వినన్
జొప్పడు నిట్టికోట ననుమం దలపోసి నిజస్వరూపముం
గప్పుచు మాఱువేసమును గైకొని వారలగుంపు సేరి తా
నప్పరిచక్రవర్తి యటు లాతఁడు సెప్పినదంతయు న్వినెన్. 33

చ. అది విని చక్రవర్తి యాడిరా! యొకవింత వినంగ నయ్యె నేఁ
డిది కడు నద్భుతంబు, మది నెంతయుఁ గౌతుక మయ్యెఁ, గోరికల్
గొదగొన నేను వేగ మటకుం జని యారమణీమతల్లి సొం
పు వనరుగానము న్విని చెవుల్ చరితార్థత నొందఁ జేసెదన్. 34

తే. అయిన నొడచింత యాస్యోడు, నట్టిరాజ
పుత్త్రినగ దేవి యైనయాపొలఁతి నిఁజను
తురక నగుచాయెదుర ధృతితోడ నిల్చి
పాడఁగా నొల్ల దిది నిక్కనంబు దలఁప. ౩౫

వ. అని యొక్కింత చింతించి, ౩౬

ఆ. ఎట్టులైన వీర లెల్లిపొద్దున నటు
కేఁగువారె యగుట నిల్లె నేను
వీరివేస మూని వెంబడి నెడలిన
నన్ని పనులుఁ జక్క నగును గాదె! ౩౭

వ. అదియునుం గాక, ౩౮

ఉ. సారతరంబు నై సకలశత్రుభయంకర మై తలిర్చుచి
త్తూరుపురంబుదుర్గ మతిదుర్గము మంచును విందుఁ గాన నే
నారయవచ్చు నాపురిరహస్యము లన్నియు నట్లు సేయ, నిం
కారమణీలలామవిధ మంతయుఁ గన్గొనవచ్చు నచ్చటన్ ౩౯

చ. అని యవనాధిపుండు హృదయంబున నెంచి నిజాభిలాష మె
వ్వనికి నెఱుంగఁ జేయక యపారముదంబున నాఁటిరాత్రియే
కొనుచు విరాగిసంఘమునకుం దగు వేసము నెందు నేరికిం
గనఁబడనట్లు సేరెఁ గుతుకంబున సత్త్రమునందు వారితోన్. ౪౦

తే. ఒకని మొగమును నచట నింకొకఁ డెఱుంగ
కునికి నీరీతిఁ దమవేస మూని యతఁడు
తమసమూహముఁ జేర నింతయును నప్పు
డందు నెవఁడును సందియ మందఁ డయ్యె. ౪౧

ఉ. నాఁ డటువాయు రాతిరి మనంబునఁ దక్కనచింత లెల్లఁ బో
నాడి, సతీమతల్లిఁ గొనియాడుచుఁ గంటికి ఱెప్ప వేయ «కీ
నాఁ డిఁకఁ గన్నులారఁగఁ గనం గల'' మంచుఁ దలంచునంతలోఁ
గోఁడులు గూసె నిండెపయిఁ గొక్కొరొకో యని యాలు లెత్తుచున్. ౪౨

శా. "ప్రాతఃకాలము వచ్చె, నేఁగవలె దూరం బింక లేలెం డటం
చాతం డాడిన లేచి యందఱు సముద్యన్మోదు లై దండమున్
జేతం గైకొని, జోలెఁ జంక నిడి డాచేఁ బాత్రిమం బట్టి "జై
సీతారా" మని పల్కుచున్ వెడలి రాచిత్తూరునుం జేరఁగన్. ౪౩

సీ. ఒకప్రక్కఁ బడమటి కొదిగి వెన్నెలఁ జిల్కుచందురుఁ గని కనుల్ సల్లవాఱ
విచ్చు రేకుల మొగ్గ లిచ్చుసౌరభము చే నాసాపుటంబు లానంద మొందఁ
జిలచిల మంచుఁ గూసెడుఝిల్లికలగుంపు వీనుల కమృతంపువెల్లి గురియఁ
బొదలసందున మెల్లఁ బొంచి వచ్చుసమీర మంటి యంటక మేను హాయి గొలుప
తే. నెచటఁ గన్న బ్రశాంత మై యింపు గుల్క
జగము నిజమానసములకు శాంతి గఱప
విపులకౌతుకంబు మెయి డిల్లి విడిచి వార
లడవిత్రోవను జని గవాయాసు లగుచు. ౪౪

సీ. అరగంట నిమరించునట్టిపక్షులఁ దేంట్లు జోలపాటలు వాడి జోఁపుచుండఁ
గనుమఱుఁ గొ తారకలదెస దీనతన్ దొంగి చందురుఁడు గన్గొనుచు నుండఁ
దళ్కుఁజీరెలఁ దాల్చి తముఁ జేరులతకూనలను గొమ్మ లూగి ముద్దుగొనుచు నుండ
నొక్కింత గనువిచ్చి యొకచేత రవి తూర్పులేమ నల్లనఁ గౌఁగిలించుచుండఁ
ఆ. నినుఁడు వచ్చుత్రోవ నిరుదెస మేఘముల్
గుంపుగుంపు గాఁగఁ గూడి యెదురు
సూచుచుండ, నపుడు సూపఱకన్నుల
పండు వయ్యె నాప్రభాతవేళ. ౪౫

ఉ. మెల్లనఁ బట్టి వచ్చెడుసమీరకుమారునిచేతఁ జిక్కక
ల్లల్లనఁ బాఱి, తొట్రుపడి, యంతట సందుల దాఁగి, యీపదు
త్ఫుల్లసుమంబు లచ్చటను బొంచుచు వచ్చినఁ గేరి నవ్వి తా
ముల్లస మాడఁ జూచి తల లూచుచు సంతస మందె వృక్షముల్. ౪౬

తే. తళుకుము త్తైపుఁజీర సదల్చి, యంతఁ
బసిఁడిసరిగెలచెంగావిఱలువ గట్టి
పద్మరాగంపుఁజేర్చుక్క ఫాలసీమ
నపుడు నిలిపి వెలుఁగొందె నభశ్రీలక్ష్మి. ౪౭

భిల్లుల వెంటఁ గొని రమ్మని వీరసేనుని దోడిచ్చి భైరవునిఁ బంపినపిమ్మట నారాయణయోగి పున్నను జూచి "యమ్మా! తరుణము మించినవెనుక విచారించినఁ బ్రయోజనము లేదు. కావున నీవు లోనికిఁ బోయి యడిదంబులఁ గొనివచ్చి సిద్ధముగ నుండుము. భైరవుఁడును దనపరివారమును దోడ్కొని వచ్చులోపల మనము మనప్రయత్నముల ఘుండినచోఁ గార్యమును సాధింపఁ గల" మని యానతిచ్చెను. యోగియానతి శిరసావహించి పున్న లోనికిఁ బోయి వాఁడి గలఖడ్గంబుల మూఁటిని గొనివచ్చి స్వాములవారి సన్నిధికి నేతెంచెను. భైరవుఁడును తనపరివారముతో నారాయణయోగిసమక్షమునకు నేతెంచి యెదుట నిలువ యోగి వానిని జూచి "భైరవా! నీపరివారముతోఁ గయ్యమున కియ్యకొని తలవాకిట నిలువుము. మేము మువ్వురము లోనికిఁ బోయి పన్నుండినవారిని మేలుకొలిపి బంధింతుము. వారు మాపైఁ దిరుగఁబడినచో మీరు లోనఁ బ్రవేశించి వారిని పట్టి బంధింపవలయు" నని యానతిచ్చి యట్లు గావించుటకు వడివడి నడిచి లోనికిఁ బోయెను. భైరవుఁడును నారాయణయోగి యానతిచ్చినవిధమునఁ దలవాకిట నిలిచి సమయమున కెదురు చూచు చుండెను. నారాయణయోగి మఠమునఁ బ్రవేశించినతోడనె దివ్వెలఁ బ్రజ్వరిల్లఁ జేసి పన్నుండినవారిసమీపమునకుఁ బోయి మేలుకొలిపెను. వసంతకుమారమదనసింగులు మువ్వురును మేల్కాంచి కండ్లు నులుముకొనుచు ఖడ్గముల ధరించిన స్వాములవారిని బున్నాబాయియుదయసింగులను జూచి తెల్లపోయి నోట మాట రాక గుక్కిళ్ళు మ్రింగు చుండిరి. అట్లు కొంతవడి మాటాడక వారు మువ్వురును గూర్చుండియుండ నారాయణయోగి వారిని జూచి "యయ్యలారా! మీనిజస్వభావములఁ దెలియఁజేసినచో సురక్షితముగ నుండఁ గలరు. లేనియెడల మీ రిదె బంధింపఁ బడుదురు. వనవీరునిచేఁ బంపఁబడినచారు లని నాకుఁ దోచుటచే మిమ్ము చెఱబెట్టఁ దలఁచినాఁడను. కాన రహస్యమును బయట పెట్టుఁ" డని పలికెను. తోడనె వసంతుఁడు వినయవచనముల "స్వామీ! నమస్కారము. మీకు మాయందు గౌరవము కలదేని మావచనముల నమ్ముఁడు. లేనియెడ మీచిత్తము వచ్చినచొప్పునఁ జేయుఁడు. మే ముదయసింగును జూడవలయు నని ముచ్చటపడి మాధవసేనుని బ్రార్థింప నాతఁడు మాయందు గరుణ గలిగి వానియునికియు నుదంతముఁ దెలియఁ జేయ నిట్లు సందర్శింపవలె నని వచ్చినారము, కాని వనవీరునిచేఁ బంపఁబడినచారులము కాము. వనవీరునకు మాయందు నమ్మకము లేదు. అతఁడు మాధవసేనునిమిత్త్రుల మని యెఱింగి మాపైఁ బగ బూని యున్నవాఁడు. స్వామీ! మీరు మమ్ముఁ బట్టి చెఱఁ బెట్టినచో ఱెంటికిని జెడ్డరేవనిగతి మేము విచారింపవలసియుండును. మీఁద మీచిత్త" మని పలికె యాత

కుండెను. నారాయణయోగియు వారిని జూచి "మీరు ముప్పురును రాజనీతివిశారదులు కాని సామాన్యులరు కారు. సామాన్యులయం దిట్టినేర్పు పొడసూపదు. మీ రెంత ప్రార్థించినను మిమ్ము విడిచిపుచ్చుటకు మే మియ్యకొనము. నిజముగ మీ రుదయసింగుపై భక్తి గలవారె రైనయెడ మీ కేయపాయమును గలుగ నేరదు. కావున మీరు విచారింపఁ బనిలే" దని పలికి వీరసేనుని బిలిచి వారిముప్పురను మహీపాలునికడకు గొంపొమ్మని యానతిచ్చెను. అంతట వారు ముప్పురును లేచి బంధింపవచ్చినవీరసేనునిఁ బడద్రోచి స్వాములవారిపైఁ దిరుగఁబడిరి. తోడనె నారాయణస్వామి 'భైరవా' యని పిలుచుటయు భైరవుఁడును దనపరివారముతో లోనికిఁ బోయి యోగిపైఁ దిరుగబడిన యాముప్పురను బట్టుకొన నుంకించెను. ఆసమయమున వసంతుఁడు వీరసేనునిచేత నున్న ఖడ్గమును బెనగులాడి లాగిపుచ్చుకొని వారు దరిఁ జేరకుండఁ గాచికొనుచు కుమారమదనసింగులతో మఠము వెలుపలకు వచ్చెను. తోడనె పున్నాబాయియుదయసింగులు వారిని వెంబడించి వసంతుని దాకిరి. అప్పుడు వసంతుఁడు బెబ్బులివడువున నుదయసింగుపైఁ బడి వానిని డెగటార్ప నుంకించుటయుఁ దోడనె యుదయసింగు సింగంపుగొదమవలె గర్జించి వసంతునిపైఁ గవిసి ఖడ్గము ఝళిపించి పదక్రమము దప్పకుండఁ బోరాడఁ జొచ్చెను. భైరవుఁడును దనపరివారముతో వసంతునిపైఁ బడ నుంకింపఁ దోడనె కుమారమదనసింగు లిరువురు నాతని నిరోధించిరి. అంతట నాభిల్లులావీరు లిరువురితోఁ బోరాడుచు భయంకరంబుగ నార్చునెడ నుదయసింగు వసంతు నలయించి పట్టుకొనఁ బ్రయత్నించుచుండ నావీరుఁడు లక్ష్యము సేయక యుదయసింగుపైఁ బడి ముష్టిఘాతంబుల నాతని నొవ్వఁ జేసెను. ఉదయసింగు వసంతుఁడు మహావీరుఁ డని గ్రహించి మెల్లన నాతనిహస్తమును బట్టుకొని తనచంక నిరికించుకొని తిరుగఁబడి నేలపైఁ బడవైచి యాతని యురమునఁ గూర్చుండ వీరసేనుఁడు పగ్గముల గొనివచ్చి బంధించెను. అట భైరవుఁడును వానియనుచరులును గుమారమదనసింగులఁ బట్టుకొనిరి. నారాయణయోగియు వసంతు కుమారమదనసింగులఁ జూచి "అయ్యలారా! మీరు మాయోపాయంబున నుదయసింగును సంహరింప నెంచితిరి. కాని దుష్టులకు జయము గలుగుట దుస్సహము. మఱియు నుదయసింగు సామాన్యులకుఁ జిక్కువాఁడు కాఁ డని నమ్ముఁడు. మీ రిక నైన బుద్ధి తెచ్చుకొని మెలంగుఁ" డని భైరవుని జూచి "భైరవా! వెంటనే వీరి ముప్పురను మహీపాలుని కడకు గొంపోయి చెఱలో నుంచవలసిన దనియు వనవీరునిచేఁ బంపఁబడినచారులనియు నాతనితో నావచనములుగఁ బలుకు" మని చెప్పి భైరవుని బంపి నారాయణయోగి యుదయసింగుపున్నాబాయిలతో మఠమునఁ బ్రవేశించి నిద్రించెను.

# పదునొకండవ ప్రకరణము.

---

"మ. భయముం బాయఁగఁ ద్రోచి వీరగుణముం బాటించి సంగ్రామని
శ్చయబుద్ధిం దలకొల్పి పౌరుషము మైఁ జూపొండె గెల్పొండెఁ గా
క యధీరత్వము నాకు నీడె యని వీఁకం జేర్చి పోరాడు మెం
తయుఁ బే రయ్యెడు రమ్ము లె మ్మెదిగినన్ దైన్యమ్ము వచ్చుం జుమీ."

(భారతము)

"అమ్మయ్యా! చిత్తూరుపురము కన్నులఁ బడినతోడనె నాప్రాణములు కుదురు పడినవి. అబ్బా! పడుచుఁదనమున నెట్లు సంచరించిన నీముసలితనమున నా కామహారణ్యములు భయంకరములై మరల నిలు సేరుదునో లేదో యనుసంశయమును గలిగించినవి. ఆక్రూరమృగములు నాకొండచరియలు నాఘీంకృతులు నాయగ్నికణములు నాకంటకావృతములైనమార్గములు నాతలంపునకు వచ్చి నన్నిప్పుడు నయితము భయము పెట్టి మేనం బులక లొదవఁ జేయుచున్నవి. ఆహా! రాజశాసనముమహిమ! వృద్ధుఁడనైనన న్నింతటికార్యమునకుఁ బురికొల్పినది. రాజు దుర్మార్గుఁడు దుర్నీతిపరుఁడు నైనను వానియనుచరులు ధర్మమును గాపాడవలసివచ్చినప్పుడు వానియాజ్ఞకు బద్ధులై యుండవలయును. అట్లు రాజాజ్ఞ శిరసావహించి మెలంగువారే దేశమునకు మేలు సేయువారు. ఏల యన ధర్మమును విడనాడి ప్రవర్తించువా రభివృద్ధి నొందజాల రనియు విజ్ఞానమును సంపాదించి ధర్మమార్గమునఁ జరియించువా రెన్నఁటి కైనఁ బ్రకాశింతు రనియు శాస్త్రము లుద్ఘోషించుచున్నవి. దానం జేసి రాజు దుర్మార్గుఁ డైన నాతఁడే శిక్షింపఁబడును. ప్రజలు ధర్మమును బరిపాలించువా రైనచోఁ బ్రకాశింతురు. కాన వనవీరుఁడు దుర్మార్గుఁ డైనను సన్మార్గుఁ డైనను నన్ను శిక్షించుటకు గాని రక్షిం చుటకుఁ గాని కర్త కాఁడు. నేను తోడిమానవుల ద్వేషింపక నెల్లరు నొక్కటియే యని

తలంచి ధర్మమును విడనాడక సత్యమును బలుకుచు నీతిమార్గమునఁ జరియించుచు నాశాపాశమునకుఁ జిక్కువడక సంతుష్టాంతరంగుఁడ నై యుండి కాయకష్టమున జీవయాత్ర గడపుచుండు నయేని నన్ను బాధించుటకు సాహసించువా రుండరు. అట్లు నీతిమార్గమున జరియించుచు రాజశాసనమునకు బద్ధుఁడ నై వర్తించుచున్నవాఁడ నగుట వృద్ధుడ నయ్యు నే నింతటికష్టకార్యమును జేయ సాహసించితి'' నని తనలోఁ దా ననుకొనుచు రాజమార్గమువెంట నడచు నొకవృద్ధుఁడు కోటలోనికిఁ బోవుచుండెను. అప్పుడు తెల్లవారు చుండెను. తొలిదిక్కున నరుణకాంతు లుదయించి యంబరలక్ష్మి నలంకరింప, వనవీరునిసేవకులు రాజ్యలక్ష్మిని బరిపాలించుకొలువుకూటము నలంకరింపఁ దొడంగిరి. కోటగుమ్మముకడ మ్రోయుతూర్యనాదము లావృద్ధునిచెవులఁ బడినతోడనె వనవీరుఁడు తననిమిత్త మెదురుచూచుచుండు నని తలంచి యొకసేవకుని బిలిచి హరిభట్టు వచ్చినాఁ డని చెప్పవలసినదిగ నాజ్ఞాపించి వర్తమాన మంపెను. ఆవార్త గొంపోయి యాసేవకుఁడు కొలువుకూటమునఁ గూర్చుండి యున్నవనవీరునకు నివేదించెను. వనవీరుఁడును వెంటనే గొనిర మ్మని సేవకున కాజ్ఞాపించెను. సేవకుఁడును వనవీరునియాజ్ఞ శిరసావహించి హరిభట్టును వెంటఁ బెట్టుకొని కొలువుకూటముఁ బ్రవేశించి రాజును జూపించి తనదారిం దాను బోయెను.

హరిభట్టు కొలువుకూటమునఁ బ్రవేశించునప్పటికి వనవీరుఁడు మంత్రి యగు కుమారసింగుతో ముచ్చటించుచుండెను. వారిసంభాషణము ముగియువఱకు హరిభట్టు వెలుపల నుండ నెంచి సంకోచించుచుఁ దలవాకిట మెలంగుచుండ వనవీరుఁడు క్రేగంటి చూపున నాతని నీక్షించి లేచి మంత్రి యగు కుమారసింగు తనవెన్నంటి వచ్చుచుండ హరిభట్టుకడకుఁ బోయి నమస్కరించి సేమ మడిగి కొలువుకూటమునకుఁ దోడ్కొని పోయి యుచితాసనమునఁ గూర్చుండఁ బెట్టి మంత్రియు దానును గూర్చుండిరి. అనంతరము మంత్రి యగుకుమారసింగు హరిభట్టును చూచి "దేవా! కమలమియరుకోటకు మీరు సురక్షితముగ నేగితిరి గదా! ఉదయసింగును బున్నాబాయియు మీ కగపడినారా? మన జనార్దనసింగు మున్నగువారివిషయమై యేమి జరిగినది?'' యని యడిగెను. హరిభట్టు

మంత్రిపలుకుల నాలించి “అయ్యా! నేను పోయినకార్యమును సమూలముగ నెఱింగించెద. సావధానుల రై యాలకింపవలయు” నని పలికెను. ఆపలుకుల విని వనవీరుఁడు “దేవా! ఆలస్యము చేయక నొక్కటొక్కటిగ నందు జరిగినవిషయము లన్నియు నెఱింగింప వలయు. మాత్తరమనోభావముల నెఱుంగ కుండ నెంత బలశాలు లైనను గార్యముల సాధింప నేరరు గదా” యని పలికెను. తోడనె హరిభట్టు వనవీరునితోఁ నిట్లనియె. “నేను పోవునప్పటికి గమలమియరుకోటలో నాల్వారు భరతపురము డోల్పూరు కరాచి ఝూలావారు సంస్థానాధిపతులును టాంకు బూంది కోట బికనీరుపురాధినాథులును దేవల సోనిగుఱ్ఱాధిపతులును గొలువు దీర్చి యుండిరి”

వన—ఏమీ! బికనీరుసంస్థానాధిపతి రత్నసింగు కూడ నం దుండెనా?

కుమా—దేవా! ఆవిషయమై మీరు సందేహింప నలదు. రత్నసింగు మొదటి నుండియు మీకు చెలికాఁడై మెలంగుచుఁ గుట్ర చేయుచున్నవాఁడు.

హరి—రాజా! ఆసమయమున సోనిగుఱ్ఱసంస్థానాధిపతి మహీపాలదేవుఁడు లేచి “రసపుత్రప్రదీపకులు మహాబలసంపన్నులు నభిమానధనులు నగు మహారాజు లందఱును నేడు కొలువుదీర్చి యుండిరి గదా! మన మందఱమును నే డిచ్చట నేవిషయమై యోజించుటకు జేరితిమో నేను చెప్ప నక్కఱ లేదు. కాని మీ కొక్కవిషయమును మాత్ర మెఱింగింపవలసి యున్నది. అది యేది యన రాణాసంగునికుమారుఁ డుదయసింగు యుక్తవయస్కుఁడై నారాయణయోగిమఠమున నుండుట మీ రెల్లరు నెఱింగియే యున్నారు గదా! మఱియు బన్నాబాయి సంగునివంశమును నిర్మూలనము గాకుండఁ గాపాడుటయే గాక యింతదనుక నాబాలుని యభివృద్ధికై పడరానిపాట్లఁ బడి ధీమంతుఁడైనపురుషునికంటె వేయిమడుంగులు కష్టపడి వనవీరునిమాయోపాయంబులఁ నెఱుంగుచు నాతనినాశనమునకై యనేకప్రయత్నములఁ జేయుచుండె ననియుఁ గూడ మీ రెఱుంగుదురు. ఉదయసింగు బుద్ధిమంతుఁ డనియుఁ జిత్తూరురాజ్యమును బరిపాలింపఁ దగినవాఁ డనియు రసపుత్రులకీర్తికి భంగము రాకుండ దేశమును శత్రుదుర్నిరీక్ష్యముగఁ బరిపాలింప గలసమర్థుఁ డనియు నాతఁడు రాజ్య మేలుటకు దగినవయస్సున

మన్నవాఁడనియు మీ రెల్ల రెఱుంగుదురు. మఱియు నుదయసింగును దెగటార్చి రాజ్యము చిరకాలము తాను శాశ్వతముగఁ బరిపాలింపవలె నని వనవీరుఁడు తలంచు చుండుటయు, నుదయసింగును దెచ్చినవారికి బహుమానము లిచ్చెద నని వనవీరుఁడు చాటఁ బంచుటయుఁ గూడ మీ రెఱుంగుదురు. అట్లు వనవీరుఁ డుదయసింగును నాశనము చేయఁ జూచుచుండ మనము వనవీరుని సంహరించి చిత్తూరుసింహాసనమున నుదయసింగును బ్రతిష్ఠింపవలె నని ప్రయత్నము సేయుచున్నాము గదా! నేఁడు మన మందఱమును గలిసి రసపుత్రులయౌన్నత్యమును గోరుదుమ యేని వనవీరునిఁ దెగటార్పఁ గృతనిశ్చయులము కావలయు. ఉదయసింగును జిత్తూరుసింహాసనమునఁ బ్రతిష్ఠించుటకు శపథములు వలుకవలయు. ఇదియే 'నేఁ జెప్పఁ దలఁచినవిషయ''మని యుపన్యసించెను.

కుమా—ఏమీ! మహీపాలుఁ డిట్లుపన్యసించెనా?

వన—తరువాత!

హరి—తరువాత నో దేవా? ఆల్వారుమహారాజు కుంభుఁడు లేచి గంభీర వాక్యములతో ''మహారాజులారా! మున్నొకసారి వనవీరుఁడు తనకంచపుబొత్తునకు రమ్మని పిలిచినపుడు మీ రందఱును బట్టినశపథమును జ్ఞప్తికిఁ దెచ్చుకొని యుదయ సింగునకుఁ దోడై కక్ష సాధింపవలయు. రసపుత్రులు మానము గలా రని లోకు లనుకొను మాటలను నేఁడు వ్యర్థము సేయఁ దగదు. ''ఉదయసింగు యుక్తవయస్కుఁడై రాజ్యము నేలుటకుఁ దగినవాఁడై యైనఁ దప్పక మనము వానిపక్షమునఁ బోరవలయు'' నని యింత దనుక బలుకుచు నెప్పుడెప్పుడని యివ్విధులూరుమీరు నే డుత్సాహమును విడువక పోరాడవలయు'' నని యుపదేశించెను.

వన—ఔరా! ఆల్వారురాజు కుంభుఁ డింతటిమోసము చేయు నని నే నెన్నఁ డనుకొన లేదు.

కుమా—దేవా! నాఁడు కంచపుబొత్తు నిరసించి రసపుత్రులు క్రోధము బూనుట కీ కుంభునిప్రోత్సాహమే కారణము.

హరి—ఆయుపదేశవాక్యముల విని సంస్థానాధిపతు లందఱు నైకకంఠ్యముగ నుదయసింగునకు జయ మగుఁ గాక! నిర్భయముగ రణరంగమున నిలిచి పౌరుషము

జూపి జయము గాంచి రాజ్యలక్ష్మిని జేకొనుటయో లేక పగతురచే నాలంబున సంహరింపఁబడి వీరస్వర్గము జూరగొనుటయో శూరునకు లక్షణము గావున వీరపురుషోచితమైనధర్మమును గాపాడ నీసంస్థానాధిపతు లందఱును సంసిద్ధులై యుందురు గాక! మఱియు నిర్భయముగ రణరంగమున నిలిచి పెండ్లికొమరులవలె సంతోషముతో మెలంగుట పూర్వాచారము గావున నాయాచారము ననుసరించి రసపుత్త్రు లందఱు నీచుఁడు దుర్మార్గుఁడు నైనవనవీరుని సంహరించి యుదయసింగును రాజ్యమునఁ బ్రతిష్ఠింతురు గాక" యని పలికిరి.

కుమా—(ఱిచ్చవడి) ఏమీ! సంస్థానాధిపతులు యుద్ధము సేయ నిశ్చయించిరి గా?

వన—వారి కంత్యకాలము సమీపించినది. కావుననే యిట్టిదుర్మార్గమునకు లోనై రాజద్రోహముఁ దలపెట్టినారు. (అని హరిభట్టును జూచి) తరువాత నేమి జరిగినది?

హరి—ఆపలుకుల నాలించి మహీపాలుఁడు "మఱియు వనవీరునిచేఁ బంపఁబడినగూఢచారులు మంత్రి యగుకేశవశర్మయు సేనానాయకుఁడు జనార్దనసింగును మానసింగుమహారాజుమంత్రి మాధవసింగును మొన్న నారాయణసింగుమతమువద్దఁ బట్టుకొనఁబడిరి. వా రిప్పుడు మాసంస్థానపుఁజెఱసాలలో నున్నా" రని పలికెను.

వన—(తెల్లబోయి) ఏమీ! మంత్రియు సేనానాయకుఁడు బట్టువడి చెఱ నుండిరా? ఔరా! ఎంతపని చేసినారు. కుమారా? చూచితివా వీరిదౌర్జన్యము? ఇంక మన మూర కుండ రాదు. రహస్యమున మనము చేయుప్రయత్నము లన్నియు విఘ్నములై పోవుచున్నవి. కాన సేనాసమేతుల మై సోనిగుఱ్ఱసంస్థానమునకుఁ బోయి మహీపాలుని దండింపవలయు. వెంటనే సేనల నాయత్తపరుచుట మంచిది.

కుమా—(హరిభట్టును జూచి) అయ్యా! తరువాత నేమి జరిగినది?

హరి—తరువాత సంస్థానాధిపతు లందఱు మంత్రిసేనానాయకులు చిక్కినందునకు సంతసించి వారిని విడిపించుటకు దేవర యుద్ధ మాచరించునెడ గయ్యము నేయ నిశ్చయించుకొనిరి.

కుమా—దేవా! చూచితిరా వారిసాహసము? తమశక్తి తారెఱుఁగక దేవరపైఁ దిరుగఁబడుటకుఁ గూడ నాసంస్థానాధిపతులు సంసిద్ధులై యున్నవారు.

వన—కాలము సమీపించినవారియందుఁ బొడసూపుగుణము లాసంస్థానాధిపతుల యెడ వర్తించుచున్నవి. వీరు మనపైఁ దిరుగబడుట దివ్వెపై మిడుతలు గవియుటయే.

హరి—దేవా! పగతురు నీరసు లని మీరు తలంపవలదు. సోనిగుజ్జుసంస్థానాధిపతి యెట్లు చెప్పిన నట్లు వర్తించుటకు సంస్థానాధిపతు లందఱు సంసిద్ధులై యున్నవారు. కాన దేవర త్వరపడక సామమున సాధించుట యుచితము.

అని హరిభట్టు పలికినతోడనె వనవీరుఁడు మండిపడి హరిభట్టును జూచి "సోనిగుజ్జుసంస్థానాధిపతితోఁ బాటు తక్కినసంస్థానాధిపతులఁ గూడ దండింప నిశ్చయించుకొన్నాను. వారిని సంహరింప కున్నఁ గార్యము చక్కఁబడ" దని పలికెను. అంతట మంత్రి యగుకుమారసింగు వనవీరునిఁ జూచి "రాజా! మన మూరకొన్నఁ గార్యము చెడును. రాజద్రోహుల నడంప కున్నచో మోసము వాటిల్లును. సంస్థానాధిపతులు కాలక్రమమున బ్రజలను గూడ నిట్టిద్వేషము దేవరపై నంకురింపఁ జేసి హాని సేయఁగలరు. కావున నిప్పు డిప్పుడె మొలక లెత్తుచున్నయీరాజద్రోహాంకురమును జిదిమివేయవలయు. లేనియెడ నెన్నిప్రయత్నములు చేసిన నమ్మహావృక్షము శాఖోపశాఖలైనపిదప మోసము చేయక మానదు. కావున సేనల నాయత్తము చేసికొని సంస్థానాధిపతులపై దాడి వెడలవలయు" నని పలికెను. వనవీరుఁడును నందుకు సమ్మతించి యేదియో జెప్పఁ బోవుచుండ నొకసేవకుఁడు ప్రవేశించి "దేవా? దేవరదర్శనార్థమై యొకయోగియు నిరువురుమనుష్యులును వచ్చియున్నవారు. వారిని దోడ్కొని రమ్మని యాన తిచ్చినచో గొనివచ్చెద" నని పలికి చేతులు జోడించుకొని యెదుట నిలిచెను. వనవీరుఁడు సేవకుని జూచి తోడితెమ్మని యానతిచ్చి వా రెవ్వరై యుందురా యని యోజించుచుండఁ జిదానందయోగి వానికిఁ గానిపించెను. కనఁబడినతోడనె వనవీరుఁడు పీఠమునుండి లేచి యెదురుగ బోయి చిదానందునికి నమస్కరించి తోడితెచ్చి యుచితాసనమునం గూర్చుండఁ బనిచి వానితో వచ్చినయిరువురను గూర్చుండ నియమించెను. అంతట వారు మువ్వురు నాసీనులైనపిదప హరిభట్టు లేచి వనవీరుని జూచి "దేవా! చాలప్రొద్దు పోయినది. నే నింతదనుక గృహమునకుఁ బో లేదు. ఇంటికిఁ బోయి స్నానసంధ్యాద్యనుష్ఠానంబుల నిర్వర్తించుకొని మరల మీసాన్నిధ్యమునకు వచ్చెద" నని పలికి వనవీరునియనుమతి వడసి స్వగృహమునకుఁ జనియెను.

కావున నింకం బడయుట యుచితంబు కాదు. పోయి వచ్చెద" మని యనుజ్ఞ గొని యాపులుగువనిత యంచబలగంబుతోడం గూడి మింటి కెగసె. అంత నమ్మరాళంబు లరాళంబులు కా కుండ సరాళంబుగ బారు దీరి నిరాఘాటంబుగం జనుచు సురారాతి పురంబువంక పొంకంబుగ తీగ సాగినవిధంబునం బారుచుం దమతోడం గూడ ప్రద్యుమ్న మనఃపద్మంబును తా మేగుసెడకుం దోడ్కొని చనుచు నారామాలిపరితాపపరికాశంబుల డింందుపడం జేసి రమణీయగమననైపుణీవిశేషంబులు లోకంబున కాలోకనీయంబు లై తమకాంతిపరిభావంబుచే దిశల నాక్రమించి గగనమండలమున కమితాలంకారంబు నొసంగుచు నొక్కెడి శరపరంపరానుపోలికను వేఱొక్కతరి సోపానంబులడంబునను ప్రసరణానూరుహంబులతోడ నుత్సాహకౌతుకంబులు పెనగొనం గొంతవడి తగ్గించి మందగమనంబుతోడం జనుచు నడుమ నుడ్డీనసండీనప్రడీనగమనభేదప్రచారంబుల వితతటంబులం జెంది పరాఙ్ముఖంబులు కాక యేకంబుగ మేళనంబు లగుచు నతివినోదంబుగం బారులు తీరి పక్షయుగళధ్వానంబులు సెలంగ నంతరిక్షంబునం బారుచుం దమతమతనూరుహంబులపై మందకిరణప్రసరణంబులచే హేమకాంతులం జెందుచు చూపరుల కమితానందం బొడంగూర్చె.

అట్లు పోవుచు నాళకుంతములు క్రీడావినోదకాలయాపనం బెడలించి గమనవేగంబున నతిక్రమించి వజ్రపురీప్రాంతంబులం జేరి యథాప్రకారముగ నాయాజలాశయంబుల నాహారవిహారంబులు సలుపుచుండె. అత్తరి శుచిముఖి కన్యకాంతఃపురకేళీకూళులయం దొక్కనాడు విహరించుచు జలవిహారంబునకై చనుదెంచినజలజాక్షులు చేయురొదల కులికి కలతం బడక, చెలు లాకరపై నొకరు చల్లుకొనుజలబిందుసముదయం బొడలిపైం బడి దుస్సహంబుగం దోచిన నోర్చి, డోలలాడువాల్గంటులు సలిలంబులం జేయుహస్త ప్రహారంబులకు నోడి చనక, క్రమక్రమంబున రాణివాసకాంతాజనంబులచెంత నిసుమంతయు బెదురు లేక యలవాటుగం జేరికలం జరియించుచుం బాటవంబుగం బరిచితి గలిగించుకొనియె.

అట ప్రద్యుమ్నుం డుత్సాహపూరితుం డై ప్రభావతీమనోహరరూపసౌందర్యాతిశయంబుల నభివర్ణించినహంసవిదుషీవాగమృతధార లుపనిషత్సిద్ధాంతానుసారముగ మనంబునకుం బారిసం బరిపరివిధంబుల వితర్కించుచు మంతనంబున నెంతయు వింతయూహలు పొడమి యాంతరికంతసంతసం బతిశయింప హెచ్చినమచ్చిక నామచ్చెకంటిపై

నిచ్చ కుదిరినకతమ్మున నేమియుం దోచక నిత్యంబును మేలు గోరుమిత్రులప్రశ్నంబులకుఁ బ్రత్యుత్తరంబు లొసంగక యఖిలబాంధవనివహంబులఁ బలుకరింపక సేవ జేయుటకై చెంగటి కరుదెంచిన సేవకులసేవల గైకొనక భోజనంబునకు సయితము యుక్తకాలంబునం జనక యనయంబు పరాయత్తచిత్తంబున వర్తించుచు నంచగరిత మించ వచించినరూపవిశేషంబును మనంబునం దలంచుచు నుపమానరహిత మైనయాదానవరాజపుత్రికమనోహరతనూవిలాసభాసురంబు మఱపు రాకుండుటం జేసి మనంబు మరలింప నేరక పక్షివచనంబులు లక్షణలక్షితంబులుగ నెంచి యంగలక్ష్మీలక్షణంబుల కానందించుచు నాశృంగారవతిసౌందర్యంబు హంసాంగన నుడివినదానికన్న వేయిరెట్లెక్కుడుగ నెంచి యారూపంబును బదింబది స్మరించుచు నాయువయునస్థితి కచ్చెరు వందుచు నిశ్చయంబుగ నాతామరసాక్షిరూపం బెయ్యదియో యయ్యదియె మనంబునం దోచిన నుబ్బి తబ్బిబ్బై సుఖమబ్బుఁ గదా యని యెంచి యంతమే లెటు లబ్బు నని వితర్కించి నిట్టూర్పు విడిచి యాలేమను జూడనిజాణజన్మంబు నిరర్థకం బని తలంచు. తలంచి యుపాయాన్వేషణంబు గావించి కుందు. కుంది పలవరించిన నేమికార్యం బని వెతలం బడు. వెతలంబడుచుండు నవసరంబునం బలుకరించినవారిపై నలుగుచు నెవ్వగలం దగిలియుండు.

ఇట్లు విరహవేదనాదోదూయమానుం డగుచు జనార్దనతనూజుం డొక్కనాఁ డుపవనంబునఁ జంద్రికాంతశిలావేదికపై నాసీనుం డై హస్తన్యస్తకపోలుం డగుచు నేకాంతంబున నిట్లని వితర్కింపఁ దొడంగె. "కనులం దిలకింప కున్నను గుణరూపంబులవర్ణన నాకర్ణించినవెనుక నాకాంతాలలామంబును గోరి చింతింపక మనం బెట్లూర కుండఁ గలదు? మనమున కగోచరంబు నసాధ్యంబు నగుకార్యం బైనను వర్ణనాకర్ణనంబునంజేసి మదీయమానసము నువ్విళ్ళూరఁ జేయుచున్నది గదా! ఆహా! ముక్కుమొగం బెఱుంగని యాతరుణిరూపంబును నాయెదుట వర్ణించినంతనె మనంబున కెంత యాతురత వొడమెను? పొడమినచోఁ జేకూరునా? చేకూరినను జేకూర కున్న నిది న్యాయమా? ఆసుందరాంగి సుందరవదనారవిందంబును నయనారవిందంబులతోఁ జూచుభాగ్య మేనాఁటి కైన నాకుఁ జేకూరునా? అది దుస్తరంబు. ఏల యనఁ దత్పురం బాయసురునియనుజ్ఞ లేనిద చొర నసాధ్యం బఁట. అట్లు పోఁ గలిగిన నావిలాసవతిం దిలకించు టెట్లు? చూచెద నేను గొందును. కనుపించినవెనుక సంభాషింపక తాళఁ గలనా? తాళలే కున్న మోసం బగును గదా! ఆమానవతి నన్నుం దిలకించి నా కనుగుణ్య యగునా? కా కున్న బ్రతుకు టెట్లు"

అని యనేకవిధంబులం దలపోతలకుఁ జొచ్చి "అంచగరిత వచియించుతఱి పాపంపులజ్జ పైకొనఁ గోరిక మాటుపరచి నేను వట్టివోరతనంపునీటుం బ్రకటించితి. అంతియే కాని యాలేమసమాచారము సావధానంబుగ నడిగి తెలిసికొన నైతిని. దానంజేసి యనాదరంబుఁ జూపితి నని తలంచి యారాయంచ వేగంబ యిటనుండి కదలినట్లు తోఁచెడిని. సరసులు రుచియింపనిప్రసంగముల నుడువఁ బోరు గదా? హంసి నాయెదుట నాముద్దియను వర్ణించిననాటనుండియు నామనం బాసుందరియందుఁ దగులుకొని మరలింప సాధ్యము గాకున్నయది. అదియునుం గాక నారూపంబున కనురూపగుపురుషరూపం బాజవరాలిహస్తంబునం గలచిత్తరువునందు లిఖియింపంబడి యుండినట్లు చెప్ప విని యుంటిని కాని సమానాకారంబు గలవా రందందుఁ గానఁబడుటచే నావచనంబు విశ్వసింప వీలు లేదు. నే నాప్రసంగంబున నించుక చన వొసంగిన మరాళి యాదనుజేంద్రకన్య నన్ను వరించునట్లు చేయు ననుట కేమియు సందియంబు లేదు. లే కున్నఁ బ్రసంగవశంబున నాచెలిగుణరూపంబుల నాసన్నిధానంబున నేల వర్ణించును? అద్భుతరమణీయరూపయవ్వనాదుల రసికాగ్రగణ్యులు ప్రసంగవశంబున రసోదంచితంబుగ వాగ్ధారాప్రభావంబున వర్ణింపక మానఁ జాల రని భావించిన నకారణంబుగ వనితావర్ణనంబుఁ జేయుటచే నేదియో కొంత వింత గుప్తం బై యుండియుండు. అటు గాకుండినఁ గేశవముచిసూదనులకు దూత్యంబు నెరపుచు వారయనుమతంబునఁ గార్యాంతర్వర్తి నై చనుచున్నమరాళి తనంతఁ దాను జనుదెంచి పోయెదుకార్యంబు తెరంగుఁ జెప్పుచు నం దొక్క లేమను వచోవిభవంబునం బొగడుట మదీయమనోభీష్టంబు నెఱుంగుటకుఁ గాని వే ఱేమికారణ ముండును? దానవవదాగ్ధంబు న న్నుప్రయోజనంబు జరుగుచున్నట్టు పొడకట్టుచున్నది. హంస ము న్నారాక్షసప్రతాపంబుఁ జెప్పునప్పుడు నే నాడినవీరాలాపంబులకు మెచ్చి దామోదరునకు దక్షిణభుజం బనఁ దగినవీ వాతని సంహరింతు వని పలుకుట సహజంబె యని నన్నుం గొనియాడె. ఇవి యన్నియు నైకకంఠ్యముగ నున్నకారణంబున నా కాలేమయం దాశ జనించుచున్నది. నారూపం బాసారసాక్షిహస్తగతం బగుచిత్రఫలకంబునం దుండుటఁ దిలకించితి నని హంసావతంసంబు నుడువుట వింటి. నారూపంబు నెవ్వరో నిర్దుష్టంబుగ నెఱింగి వ్రాసియుందు రని యుపేక్ష చేత మన్న భవానిచే వ్రాయఁబడె నని వచియింపంబడియె.

ఎక్కారణంబున నాయమ మదీయరూపంబును రచియించి యీమె కొసంగి యుండునో? లేక యితరులచే వ్రాయఁబడి పైవ్యాజంబున నొసంగఁబడి యుండునా? ఈకార్యంబున కం దెవ్వరు సాహసింతురు? అంతఃపురకాంతల కిట్టిది భర్తృమూలంబునఁ దక్క వే ఱెట్లు చేకురు? ఆపలకంబు విలాసార్థం బగునాటవస్తువుగఁ బరిగణింపఁబడునా? ప్రేమాతిరేకంబున పార్వతిచే నియ్యఁబడె నని పరమామోదంబుచే నాసుందరి చూచుచుండె నని వింటి. అది యెట్లుపేక్షణీయం బగు! ఉమ తనచే సృష్టింపఁబడినబిడ్డయభిప్రాయంబున కడ్డంబుఁ దలపెట్టునా? ఇది యంతయు నిక్కువంబా? నిక్కువంబు కాకున్న విరించి యీమె తనసృష్టియందలిది కాక యుమచే నుద్భవింపఁ జేయఁబడె నని ప్రసంగవశంబున వచియింప వినియున్నదాన నని కాదంబకాంత పలుక, మోమోటంబున నాసుందరి యేసుందరాంగునకై యీమెచే సృజియింపఁబడెనో తెలిసికొనక మందబుద్ధి నైతి నని నన్నిప్పుడు దూఱుకొన్నఁ బ్రయోజనం బేమి? వరటాలలామం బావిలాసవతీ వర్ణనావిశేషంబు నుగ్గడించుపట్టున వేలకొలఁది ప్రశ్నావసరంబు లుండిన నొక్కదానిఁగూర్చి యైనను నే నడుగ కుండుటను గ్రహించి యిచ్ఛావిరహితుండ నని యాయిందుముఖి చెంగట నీప్రసంగంబు రా నెఱుంగనిచందంబున నుండునే కాని యేమి వచియింపఁ గల్గుదును? తా నీయంశంబు ప్రశంసించునవసరంబున నే నొక్కయిష్టవచనంబును బలుకక మిన్నకున్నచెన్నుఁ గాంచి తా నచ్చటి కేఁగుట నిష్ఫలం బని చన మానునో, లేక పోవునో, ఎవ్వ రెఱుంగుదురు? దైవకృతంబుఁ దప్పింప నెవ్వరితరంబు? ఎట్లు జరుగ నున్నది యట్లై జరుగును గాని విచారించిన ఫలం బేమి? ఒకవేళ జను ననుకొన్నను నాయభిప్రాయంబు విని కని యెఱుంగనిమహామతి యెఱుంగనివిషయంబును గూర్చి యాచేడియకడ నేమి వచియింప నేర్చు? "అప్రతిషిద్ధ మనుమతం భవతి" యనులోకోక్తి నెఱుంగ కుండునా? అట్లు పోవఁ గార్యంబు లేక యుండినను. బహువిధవర్ణనాదుస్సాధ్య యగునాపడఁతుక జూడఁ జాలక తాళఁ గలదా? వర్ణనాకర్ణనంబుననె యీయుద్దియఁ జూడఁ గుతూహలము వొడముచున్న దన మున్నొక్కతరిఁ జూచియున్న జాలపాద మాలేమను దిరిగి చూడకుండ సహింపఁ గలదా?"

# హేలావతి

## ప్రథమప్రకరణము

ఒకనాఁటియుదయమున మాలవాఁడొకఁడు తనగుమ్మముకడఁ గూర్చుండి యుండెను. ఆతనియిల్లొకచిన్నగుడిసె. చూడ నసహ్యాకరముగ నున్నది. దానిచుట్టుపట్టుల మఱియేగుడిసెలును లేవు. ఒంటరిగ నున్నది. దానికిఁ జేరువ నొకయేఱున్నది. అతఁడిప్పుడు తిండి లేక మలమలమాడుచున్నవాఁడు. ఆమండల మంతయును క్షామదేవత వాతఁ బడినది. తత్ప్రాంతమునందలిజనులు వేలకొలఁది యాతనికనులముందర తిండి లేక చచ్చినవారు. అతనికిని నింక గడియకో యరగడియకో యట్టిగతియె పట్టు నని యెంచి యుండెను. ఆగుడిసెలో నొకమూల నాతనిభార్య లేవ లేక పడియున్నది. పిల్ల యొక్కర్తు పాల కేడ్చుచున్నది. లేవ సత్తువ లేదు. బొత్తిగా నెత్తు దఱిఁగియున్నది. తినుబండారములు దగ్గరయూరికిఁ బోయి కొనవచ్చును. కాని పాప మాదీనునికడ ధన మెచ్చట నున్నది? అట్టిసమయమున నాతని కుచితముగ నన్నదాన మెవ్వరు సేయుదురు? ఇంక చావె శరణ్య మని యెన్నుకొనియెను. చాలదినములనుండి యాయేటిదరిని దొరకిన కందమూలములను దవ్వి తిని కాలక్షేపము సేయుచుండెను. ఆదినమున పొద్దుట పశువులతండా యొకటి యాతనికన్నులఁ బడియెను. దాని వెంబడించి పోయి పేడ యంతయును పోగుచేసెను. అందే మైనగింజ లున్నఁ గడుగుకొని తిందమను నాశ. పొద్దుటిపూట యంతయును పని చేయఁగా చేయఁగా చేరెడుగింజలు మాత్రము దొరకినవి. అవి పచనము చేసి భార్యకు పెట్టెను. గతదినమునఁ గూడ నాతఁడు కబళించి యెఱుఁగఁడు. ఆతనియిల్లాలు మిక్కిలి పిన్నవయసుది. పదియేనువత్సరము లింకను పైఁబడ లేదు. అప్పటి కప్పుడే యామెకు ముగ్గురుపిల్లలు. ఆమెయం దాతని కెంతయో ప్రీతి. ఆమె పడుచున్న బాధలను గాంచునప్పటి కాప్రేమ మఱింత యధిక మయ్యెను. ఇంక నొక్కింతసేపటిలో వారు మృత్యుముఖమునఁ బడనున్నవారు.

దుఃఖభాజనుం డగు నాదీనుండు జలజల ప్రవహించు నా సెలయేఁటిజాలువంకకుఁ జూచుచుఁ గూర్చుండెను. ఆతనిమనస్సంతయును నాతని కప్పుడు తటస్థమైనవిపత్తు నందు మునిఁగి తేలుచున్నది. మనంబున నిట్లని వితర్కింపఁ సాగెను. "ఈప్రపంచమున నే బ్రతికి యేమిలాభము? ఎప్పుడు చూత మన్నను ఏకాకిత్వము తప్ప మఱియొండు లేదు. ఏజాతిలోనను చేరనివాఁ డెవ్వఁ డైన నుండిన నీజాతివాఁడె. ఈజాతివాఁడే నా దోసము చేసికొని పుట్టినది? అట్టిపనికిమాలినకడజాతియందు పుట్టి యిట్టిపాపపుబ్రతుకు బ్రతుకుటకంటె మరణ ముత్తమము కాదా? బ్రాహ్మణుఁడు పోవుమార్గము వెంటఁ బోవ రాదు. అతఁడు క్రోశెడుదూరమున నుండఁగనే తప్పించుకొని పోవలెను. దరికిఁ బోయిన చావు సన్నిధానమే కదా? ఏక్రూరకర్ముఁడు ప్రాణాపాయమును తలపెట్టినను యెదురింప సమర్థత యుండియుఁ జేయెత్త రాదు. పుణ్యపురుషులు సంచరించుభూమి నాతనినీడ యైన సోఁక రాదు. అట్టిపాపకార్యమే తటస్థ మగునెడల తప్పక నాఁటితో వానియాయువు మట్టమే. కానీ, అబ్బా! చావుపేరు చెప్పిన నెంతయో సంకట మగుచున్నది. ఈకళేబరమును కాకులును గద్దలును కబళించినవెనుక, నీతనిమన్ను మన్నులోఁ గలసినవెనుక నీమాలవానిగతి యేమగునో? ఇప్పు డితనికి మరణముకన్న వేఱు శరణము లేదు. ఆశ లన్నియు నడుగంటినవి. బ్రతికినందువలన ఫలమును గనిపిం చుట లేదు. కాని ప్రాణము పోవు నన్న భయ మగుచున్నది. ఎంత సంతాపకరముగ నున్నను, పడుకష్ట మిట్టిదని యనునిశ్చయ మున్నది. జీవితానంతర మేమి కానున్నదో, ఏమి నిశ్చయము? ఎంత దుఃఖావహ మైనను, నిశ్చయమును విడిచి, అనిశ్చయము నాశ్ర యింపఁబోవుట యనిన మనస్సునకు భయము కలుగదా? ఎఱుఁగనియూరికి పో నున్న ప్పటికి భయ మిట్టిదియ కాదా? ఎన్నియనర్థములు పొంచియున్నను కొంచెమో గొప్ప యో యిందు సుఖము గలుఁగకపోదు. న న్నాశ్రయించుకొనినవారల కెట్లో యింత తిండి కాధారము చూపితినేని యీజన్మము సుఖజన్మ మనియే చెప్ప వచ్చు. నాభార్య యనిన నా కెంతయో ప్రేమ. బిడ్డయందలిమమకారమునకు మేరయే లేదు. ఇంత దుఃఖభాజన మగుజీవనము జీవించుచున్నను వారి కెట్లేని యొక్కింత యాహారపదార్థ ములు సేకరింపఁ గల్గితినేని, అతిదైన్యం బగునీచండాలజన్మంబైనను, అంత హేయం బని యనుకొనఁ బని లేదు?"

ఆతఁ డాయేటిజాలువంక నన్యధ్యానపరాయత్తతఁ జూచుచుండ నిట్టితలంపు లాతని మనంబున నుత్పన్నము లయ్యెను. ఆస్థలమున నేఱు మిగులవెడల్పుగను మిక్కిలిలోతుగను నుండెను. అతఁ డీరీతి యోచనలతో మునిఁగి తేలుచుండఁగా నవతలయొడ్డున నొక యాశ్వికుఁ డతిత్వరితగమనంబున వచ్చి వ్రాలెను. ఆచప్పుడుతో నాతనిసమాధి కంతరాయము కలిగెను. ఆయాశ్వికుఁడు నచ్చురీతిఁ గనుంగొనిన వడిదుడుకుగా నున్నది. ఏఁటి దరిగ పరుగుపరుగున వచ్చుచుండెను. మనదీనుఁ డాతఁ డంతటంతట నాగు నని తలంచుచుండెను. కాని అతఁ డట్లు లాగక వడివడిగఁ బోవుచున్నవాఁడు. ముందువెనుక నాలోచించువాఁడుగఁ గన్పట్ట డయ్యెను. ఆతఁడు గుభాలున తనగుఱ్ఱము నాయేఁటిలోని కురికించెను. ఆప్రవాహము వడిదుడుకుగా లేదు గాని తీవ్రముగ మాత్రమున్నది. ప్రవాహమునం బడి కొంతదూరము కొట్టుకొనిపోయెను. గుఱ్ఱము జీనిభారముచే కృంగి పోవుచుండెను. దానిమూఁపున పెద్దసంచి యొకటి యున్నది. ఆకారణముచేత నదియును మునిఁగిపోవుచున్నది. అతఁ డావిపత్తుఁ గనిపెట్టి, యాజీనిసంకెల సడల్పనయ్యాది గట్టున కీదుకొని వచ్చెను. కాని అతనికి నొంట దుస్తులు బహుభారముగ నున్నవి. ప్రవాహవేగము శక్తికి మించుచున్నది.

జీనిభారము వదలిపోవుటతోడనె గుఱ్ఱము నీఁటిపైఁ దేలి బింకముగ గట్టున కీదుకొని వచ్చెను. ఆశ్వికుఁడు మాత్రము కష్టమునఁ బడిపోయినాఁడు. తలమునుకలైనది. నీళ్లు త్రాగుచున్నవాఁడు. ప్రాణముపై నాశ పోయినది. నిస్పృహత యంకురించినది. కొట్టుకొనుచున్నవాఁడు. అతఁడు కొట్టుమిట్టాడుటఁ జూచిన నింక నాతని కవసాన మతిసమీపమున నున్న దని యనిపించుచున్నది. లోనికి పోయిననీఁటితో కడుపు భేరి వలె నుబ్బినది. గ్రుడ్లు తేలవైచినాఁడు. స్మారకము తప్పుచున్నది. రొప్పు పుట్టినది. వెల్లకిలఁ బడి ప్రవాహమునఁ గొట్టుకొనిపోవుచున్నవాఁడు.

మనదీనుఁ డాపాంథుఁడు పొందుకష్టమును కనిపెట్టినాఁడు. అతనికి ప్రాణము తల్లడిల్లినది. ఆతనికి నొంట జవసత్వములు లేవు గాని, అకారణముగ మనుష్యుఁడు చచ్చిపోవుచుండఁగఁ జూచి యోర్వ లేకపోయినాడు. అతఁడు కొట్టుకొనిపోవుస్థలమున కెదురుగ నేఁగి గుభాలున నేఁటిలోని కురికెను. అతికష్టముమీఁద నాతనిఁ గట్టునఁ జేర్చినాఁడు.

పాప మా తెరువరికి స్మారకము తప్పి యున్నది. మనయంత్యజుం డాతని నిటునటు పొరలించియు, కడుపునఁ బడిననీరు వెలుపలకు వచ్చునుపాయములు చేసియు, నాతనికి కొంతసేపటికి తెలివి వచ్చునట్లు చేసెను. పాంథుఁడు తనకు పరమోపకారి యయినయాకడజాతివాని నుపలక్షించి, యాతని ధన్యాత్ముండవ వని యాశీర్వదించెను. అది యాలకించి యంత్యజుఁడు,

"అయ్యా! మీరు మహమ్మదీయమతస్థులా? మీకు జాతి యనిన, అంత యేవగింపు లేనట్టున్నది. అయ్యా! మా గాలి సోఁకినంత మాజాతివా రందఱికును పాతకము వచ్చి చుట్టుకొనునంట. మీ కట్టియడ్డంకులు లేనట్టున్నవి. లేక పోవుఁ గాక! మాజాతి వారు మాత్రి మట్టు లుండ రాదు. నీ కిప్పుడు రక్షకుం డయినవానిని హిందువులు దరికి చేర నీయరు. అట్టియీపంచముఁడు ఒక్కప్రాణమును నేఁడు సంరక్షించి కృతజ్ఞతకు పాత్రుం డయినట్టు విని యానందించుభాగ్యము లభించినది. మిమ్ముల నుద్ధరించుటవలన ప్రపంచమున నిట్టియధమవర్ణములవారిం గూడ నాదరించుమనుష్యులు కొంద ఉన్నట్టు బోధపడినది."

అని చెప్ప నాపాంథుఁడు "ఓయీ! నీవు నాకు ప్రాణదాన మొసంగి పుణ్యము గట్టుకొంటివి. మీజాతితోడను జన్మముతోడను నా కంతగా ప్రసక్తి లేదు. తోడి వారల కుపచరించుపట్టున నడ్డంకిగా నుండుజాత్యంతరతారతమ్యములు కేవల మనర్థదాయకములు. నీ కంగీకార మగునేని నీయింటఁ గొంతకాల ముండి మఱి పోయెదను."

"అయ్యా! మీరు మాయింట నుండుట కేయభ్యంతరమును చెప్పఁ జాలను. కాని మాతోడఁ గూడ మీరు తిండి లేక మలమల మాడవలసివచ్చును. నా కింక నొక్కింత సేపటిలో సుగతియో దుర్గతియో చేకూర నున్నది. దుర్గతియే యని నానమ్మకము. సంఘమున కంతకును దూరస్థుఁడ నై యుండునాయట్టివానికి దుర్గతి గాక సుగతి యెట్లు వచ్చును? ఈగుడిసెలో నాభార్యయును ముగ్గురుపిల్లలును తిండి లేక మాడి చచ్చుచున్నారు. మీయట్టివాని కిట్టిసమయమున నాతిథ్య మియ్యవలసివచ్చెఁ గదా యని విచారము కలుగుచున్నది."

"నారక్షణయే నీకును రక్షణ కావచ్చును. నీ కొక్కింత యుపకారము చేయఁ గల ననిపించుచున్నది. నాగుఱ్ఱము భద్రముగ గట్టు చేరినది. దానిమూపున తినుబండారములసంచి యున్నది. లెమ్ము. నీయింటికి పోవుదము రమ్ము."

అనునప్పటి కాతనిరక్షకునికన్నులు సంతోషతరంగితంబు లయ్యెను. వంగి వంగి సలాములు చేసెను. కణకణలాడునిప్పులవలె కాలుచున్న ఫాలభాగంబున తన యంగుళులు చేర్చి, అయ్యాగంతుకుని బహువిధముల భూషించెను. పిమ్మట నసహ్యాకరముగ నుండుతనగుడిసె కాతని వెంటఁబెట్టుకొని చనియెను.

అతఁ డందు ప్రవేశించునప్పటి కాతనికన్నులకు గోచరించినది మరణయాతన మొందుచున్నయాతనిభార్య. ఆమె నేలను బడి విలవిల కొట్టుకొనుచున్నది. ఆమెప్రక్క నిద్దఱుపిల్ల లున్నవారు. అందొకపిల్లకు రెండేండ్లు. మఱియొకపిల్లకు మూఁడు. మూఁడవపిల్ల మరణింప నున్నతల్లియొద్ద చేరి స్తన్యము గీరుచున్నది. అయవస్థ చూచునప్పటికి తండ్రి యగువానిఁ కెవ్వనికిఁ గన్నులనీరు రాకుండును? ఆగంతుకునకు చెక్కు చెమర్చెను. అది మనయాంత్యజునికన్నులఁ బడియెను.

గుఱ్ఱము గట్టున చేరుటతోడనే స్వభావసిద్ధం బగుజ్ఞానముతో నదియు నాగుడిసెయొద్దకు వచ్చెను. తనయజమానుఁడు వచ్చునప్పటికి ఆగుడిసెయొద్ద బరుండియుండెను. దానిపై నున్నసంచి విచ్చి, యందున్నయాహారపదార్థము లన్నియును పైకి తీసెను. అందు చల్దియన్న మున్నది. సంభారము లున్నవి. పచనము చేసినమాంసమును, పరిష్కా దేశపుసారాయములు నున్నవి. అందలియన్నముమూటఁ పైకిఁ దీసి దాని నారవిప్పి, అందు సారాయములు పోసి కలిపెను. ఇంతలో మిగుల నాత్రముతో నుండినయాయంత్యజుఁడు సారాసీసాలను దీసికొని యెండిపోయియున్నవారి కుత్తుకలఁ దడుపుచు నడుమ నడుమ తనదాహమును కొంత యుడిపికొనఁ బ్రారంభించెను. తరుణమునకు సంప్రాప్తమైనయాయాహారమున వారికి క్షుద్రోగమునుండి శీఘ్రముగ శాంతి యొదవెను.

ఈయాగంతుకుఁ డిట్లు బ్రతికి బయటఁ బడినవెనుక, ఆతనివెనుక కొందఱాశ్వికులవ్వలయొడ్డుననుండి యేటివారను వచ్చిరి. కాని ప్రవాహవేగమును తద్వైశాల్యమును దాట శక్యము గా కుండుట కనిపెట్టి వార లందఱు వెనుకకుఁ బోయిరి. ఆనాటిరాత్రి యాయతిథి ఆపసోపము పడ నారంభించెను. నిద్దుర పట్టలేదు. కడుపులో మంట ప్రారంభ మయ్యెను. నాడి యథాగతి తప్పియుండెను. దేహ మంతయును వెచ్చనయ్యెను. పండుకొనుట కాగుడిసెలో నొకమూల నొక్కింత పట్టిగడ్డిమాత్ర మున్నది.

అందుమీద శాలువ యొక్కటి కప్పుకొని పండుకొనియెను. ఆశాలువ యెల్లప్పుడును అతని మెడను చుట్టుకొని యుండును. ఉదయమునకు జ్వరతీవ్రత హెచ్చినది. అది క్రమముగ ముదురుచున్నది. కాని తగ్గుట లేదు. చిలికిచిలికి గాలివాన యైనది. పాప మాతని కాజ్వరబాధ హెచ్చి సన్నిపాతములోనికి దింపినది. అతనిస్థితి క్రమక్రమముగ దుస్థితిలోనికి వచ్చినది. తిండి లేక మాడి చచ్చుచున్నయాకుటుంబము నానాటికి మరల పురికొనియెను.

ఆసంచిలో తినుబండారములు కాక, ఆఱువేలరూపాయిలవిలువ గలబంగారము కూడ నున్నది. తినుబండారములు వెచ్చమై పోయినవి. అందొకనాణెము గొని తన యతిథికిని తనకుటుంబమునకును కావలసినయాహారపదార్థములు సేకరింప దగ్గిరపట్టణము నకుఁ బోయెను. వీని కన్నిటికిని ఒక్కరూప్యమునకన్న హెచ్చుసొమ్మవసరము లేక పోయినది. ఆసొమ్ము మాత్రము తీసుకొని తక్కినసొమ్ము యథాప్రకారముగ నాతని సంచిలో నుంచెను. తనకుటుంబము మిక్కిలి దురవస్థలో నుండి చావునకు సిద్ధమయి యుండునపు డతఁడు తమకు చేసినమహోపకారము విస్మరించినవాఁడు కాఁడు. స్వతస్సిద్ధముగ దయార్ద్రహృదయుఁడు. తదనురూపం బగునాదరంబున వాని కుపచారంబులు గావించి యాయతిథిని రాత్రిందివములు కాచియుండెను. భార్య భర్తకు తోడయ్యెను. ఉభయులును గూడ మహోపకారి యయిన యాతనిప్రాణంబున కెచ్చట మోసంబు వాటిల్లునో యని భయపడ మొదలుపెట్టిరి. కొంతకాల మిటు లుండియుండి అతనిదేహపటుత్వము రోగపటుత్వముతోడ పోరాడి విజయము గాంచెను. జ్వరబాధ ఉపశమిల్లినది. ఆరోగ్యము కలిగినది. మరల నెప్పటి తెలివితేటలు గలిగినవి. వారిశ్రద్ధాభక్తులకును, ఆదరణమునకును, నాతఁడాదంపతుల నెంతయో ప్రశంసించెను. ఆయింటియాతఁ డాతనిధన మాతని కొప్పగింప నెదుటఁ బెట్టెను. అందు వెచ్చపెట్టిన సొమ్మునకు దమ్మిడీలతో సమాధానము చెప్పెను. పాంథుఁడు మఱియొక్కచోటునకు పోవ జవసత్వములు వచ్చునప్పటికి చాలకాల మయినది.

అతనికి ఆరోగ్యము వచ్చులోపల తన్నాదరించినవారలగుణాగుణములు తెలిసికొన నవకాశము చిక్కెను. ఉభయులకును గూడ నారోగ్యము కలిగినది. భార్యది సున్నిత మయినదేహము. ముఖవర్చస్సు చూడ నింపుగ నుండును. సాధుభావమును దర్శనీయ మయినయాకారమును నెక్కుడుసమును గలిగి యాచెలువ యలరారు.

పురుషుఁడు పడుచువాఁడు. దేహపటుత్వము గలవాఁడు. కుదిమట్టముగ నుండును. జమిలి యొడలుకవాఁడు. అతనిశరీరపటుత్వముం గాంచిన నెంతటికష్టనిష్ఠురముల కైన నోర్చెడి నట్టిదిగఁ గనంబడు. పెద్దపిల్ల కింకను మూఁడేండ్లు నిండ లేదు. ఆబాలిక అప్సరసవలె నుండును. జాతికిని చక్కఁదనమునకును సంబంధము లేదు. ఏజాతి యైన నేమి? గుణము ప్రధానము. ఆబాలిక సర్వావయవరామణీయకముం గాంచిన మిక్కిలియదృష్టవంతుల కుండవలసినలక్షణము లన్నియును కనుపట్టుచుండెను. ఆబిడ్డవయోవిలాసముం గాంచి తలిదండ్రుల కెంతయో యానందముగ నుండెను. వా రామె నెంతయో ముద్దుగాఁ బెంచుచుండిరి.

ఆగంతుకుఁ డొకఁడు తనయొద్ద కూర్చుండి పొగచుట్టఁ ద్రాగుచున్న పంచముని గాంచి “ఓయోగ్యశీలుఁడా! నే నింక విశేషకాల మిట నుండఁ జాలను. ఈగుడిసె నా కిప్పుడు శరణ్య మైనది. ఇట్టియసదలయాలయ మెవ్వరికిని శరణ్య మై యుండు నని యెవ్వరును తలఁపం బోరు. నాయనారోగ్యసమయమున నే నెన్నటికి మఱువఁజాలని యాదరణమున నన్నుఁ గాంచితివి. ఆఋణము నే నెన్నటికిని తీర్పఁ జాలను.”

“అయ్యా! అట్లన రాదు. మృత్యుముఖమున నున్న మమ్ముం బ్రతికించి ప్రాణదానము నొసంగితిరి. మీరు మాకు చేసినమేలులో నిది యెంత? అది యట్లుండ నీయంత్యజన్మునియందు తాము జూపిన యీయాదరణాధిక్యమువలన మేము మఱింత తనిసితిమి.”

“ఓయీ! మీ రప్పు డెవరికి శర ణొసంగితిరో యెఱుఁగుదురా?”

“దానితోడ నా కేమియును బ్రసక్తి లేదు. తోడిమానవునిజీవన మొకటి రక్షింపఁ గల్గితిని. నా కదియే సంతోషము. మీ రెవ్వ రైనను, ఎంతవా రైనను నాకుఁ దెలిసికొన నవసరము లేదు. మీరు నాకు రక్షకులరు. మిమ్ముల నెన్నటికిని మఱవఁ బోను. నాప్రాణమునకన్న నత్యంతప్రియతమంబుగఁ జూచుకొన్న నాభార్యాపుత్రుల సంరక్షించి నాకృతజ్ఞతకు పాత్రు లైతిరి. ఈఋణము నేను మరలించుకొన నేరను.”

“నేను రేపు వెడలిపోయెదను. నీచే నిప్పుడు సంరక్షణ నందినవాఁడు ఈదేశ చక్రవర్తి హుమాయూను. ఇయ్యది నీకు తెలిపిన నీకు మఱింత సంతోషముగ నుండ వచ్చును. నన్నిప్పు డొకరాజద్రోహి సింహాసనమునుండి వెడలఁ దరిమినాఁడు. నారాజ్యము నేను మరలఁ గైకొనుదాక యెచ్చట నైనను తల దాచుకొనవలయును.”

ఆతనిపావనములం బడి పరిపరివిధములఁ బ్రస్తుతించిరి.

చక్రవర్తి—“ రెండు- పాదీపన లందికొనుఁడు. ఈయుంగరమును ఈబంగారు నాణెములును గైకొనుఁడు. ఇంకముం దిట్టిబాధ లేవియును లేకుండఁ గాలక్షేపము సేయుఁదురు గాక.” అని చెప్పుచు నమూల్యమైనరత్నపుటుంగర మొకటి తనవ్రేలినుండి తీసి యాపురుషునివ్రేల నుంచెను. రెండువేలమొహరీలు సువర్ణదానము చేసెను. ఈపేద కవి పెన్నిధానము కాదా? వారి కింక జన్మ మున్నంతవఱ కేకొదువయును రాదు. ఆదంపతులకన్నుల నానందాశ్రువులు గ్రమ్మెను. హుమయూనునకు దేహపాటవమున యథాస్థితి లభించెను. హుమాయూను మఱుసటియుదయమున లేచి గుఱ్ఱము నెక్కి పోయెను.

భ్రాతృభక్తిభరితాంతరంగుం డగుపాండురాజు తాను రా జయ్యును గుడ్డివాఁడగునన్నయందుఁ గలభక్తిం జేసి రాజ్యశాసనాధికారం బతనియందుఁ బెట్టి తదాజ్ఞానువర్తియై పరివర్తించుచుండె. తమ్ముని సౌహార్దంబున ధృతరాష్ట్రునకుఁ బట్టాభిషేకమే లేకపోయినది గాని సర్వాధికారములును మూర్ధాభిషిక్తునకుం బలెఁ గలిగినవి. దీనికి భీష్మాదులు ననుమతించిరి. ఇట్లుండఁ బాండురాజు పరివ్రాజితుఁడై తనపరిభులాంఛనంబులన్నియు నన్న కంపి వచ్చిన నవి గ్రహించి యతండు రాష్ట్రైకనాథుండును నిరంకుశుఁడునై గండు మిగిలె. నాఁటినుండియు రాజ్యము ధృతరాష్ట్రునియందును అతనికొడుకులయందును బొందుపడి యుండె. ఇది యే ధృతరాష్ట్రదుర్యోధనులు రాజు లనుటకుఁ గారణము. పిమ్మటఁ బాండవులు వచ్చినపుడును వారితండ్రిరాజ్యము వారి కీయక వారిని ధృతరాష్ట్రుఁడు నతనిసుతులును గందారాజులుగానే చూచుచుండిరి. భీష్మాదు లిది యంతయు నెఱింగినవా రయ్యును నెఱుంగనివార ట్లయై యప్పటిస్థితి కంగీకరించిరి. పిదపఁ గొన్నినాళ్లకుఁ బ్రజలు తనచేతను గర్హించుటంజేసి యేది యెట్లు వచ్చునో యని గుడ్డివాఁడు ధర్మజుని యువరాజుం జేసినాఁడు. దానికి దుర్యోధనుండు సహింపక రాజ్యము తనతండ్రిది గా దని తెలిసికొని యప్పటియూపరాజ్యమే కాక సర్వరాజ్యమును బాండవులకే వచ్చునేమో వచ్చినఁ దానుం దనవారును భృత్యులవలె నుండ వలసి వచ్చు నని దురాలోచనము చేసి తండ్రియనుమతిం గొని వారణావతంబున లక్కయిల్లు గట్టించి యందుఁ బాండవులఁ బ్రవేశపెట్టి నిప్పు వెట్టించె. వారును విదురునిచే నది యంతయు నెఱింగియున్నవారు కావున నగ్నిదాహంబునకుం దప్పి బ్రాహ్మణవేషములతో దిరిమ్మరుచుఁ గాంపిల్యపురముఁ జేరి మత్స్యయంత్రి మేసి ద్రౌపదిం గ్రహించిరి. ఆవృత్తాంతము విని దుర్యోధనాదులు మిక్కిలి సగచి మరల దురాలోచనము చేసిరి. అపుడు భీష్మద్రోణవిదురులు తగ దన కౌరవులం దిరస్కరించి, "ధృతరాష్ట్రుఁడు జాత్యంధుఁ డగుటచే రాజ్యానర్హుఁ డయ్యె. దానంజేసి పాండురాజు కురురాజ్యమునకు రా జయ్యె. ధర్మశాస్త్రప్రకారము పాండురాజు రాజ్య మతనికొడుకు ధర్మజునకుం జెంద దగియున్నది. అట్లున్నప్పటికిని పెద్దవాఁడై రాజ్యము నొందఁ దగినధృతరాష్ట్రుఁడు రాజు గాక పాండుఁడు రా జయ్యెం గావున నిట్టి ధర్మశాస్త్రవిచారణ చేయక రాజ్య మవిభాజ్య మైనను (తొల్లి వృసుచక్రవర్తి మొదలగువారు రాజ్యమును ఖండఖండములుగా

కేసి కొడుకులకుఁ బంచిపెట్టినట్లు ప్రమాణము లున్నవి కావున) నీకురురాజ్యము ంభాగించి కురుపాండవులు సమముగా ననుభవించుట యుక్త'' మని చెప్పిరి. దాని ంగీకరించి ధృతరాష్ట్రుఁడు పాండవులం బిలిపించి సాబాలురాజ్యము వారి కిచ్చె. వారును ఖాండవప్రస్థమున నివసించి రాజ్య మేలుచు మిక్కిలి ఖ్యాతిం బడసిరి. అది చూచి సహింపక దుర్యోధనుఁడు మాయజూదమున నది యంతయు నపహరించి వనవాసము నజ్ఞాతవాసమును వారికి ఘటిల్లఁ జేసెను. ఆవెనుక వచ్చి పాండవులు తమ రాజ్యమును దమ కిమ్మని యడిగిన నీయ కున్న భారతయుద్ధము జరిగినది. ఈకారణముం బట్టియే కురురాజ్యము పాండవులకుఁ బైతృక మనుటకును, అర్ధరాజ్య మనుటకును, వ్యవకాశము గలిగినది.

దీనిం గూర్చి పలువురు పలువిధంబులుగ నభిప్రాయపడి వ్రాసియున్నారు. నేఁ జూచినభారతప్రతులయందు నావాదమున కనుకూలించువిషయములను సంగ్రహించి నే నిట్లు వ్రాసియున్నాఁడను. బ్ర॥ కా॥ బ్ర॥ శాస్త్రులుగారు తమవ్రాసిన కురుపాండవదాయభాగవినిర్ణయముం గూర్చి చర్చించి వ్రాసిననావిమర్శనమువలన నాయం దాగ్రహభావమును వహింపక నావిమర్శనమును జక్కఁగాఁ బరిశీలించి నావ్రాసినవిషయము తమకు నచ్చ కున్నచో మహాభారతప్రమాణములవలన సయుక్తికముగ నావ్యాసమును ఖండించినచో నాయభిప్రాయమును మార్చుకొని ప్రస్తుతము నారచించుభారతమును సంస్కరించుకొని వారియెడలఁ గృతజ్ఞుఁడ నై యుందు నని యిందుమూలమున విన్నవించుచున్నాఁడను.

ఇట్లు,

శ్రీపాద కృష్ణమూర్తి.

# భాసమహాకవి.

ఈశతాబ్దమునుహిమ యెట్టిదో కాని యుత్పన్నము లగుమహాకావ్యము లెన్నియో బయలువెడలు చున్నవి. తాళపత్రికాంతారములు శోధింపఁగాఁ దిక్కనాదులకుఁ బూర్వ మిందఱుకవులు గల రని యిప్పుడు గదా తేలినది! వారలనామములు సహితము శ్రవణగోచరములు కా కుండెను. చరిత్రము లేనప్పు డిభకుంభశాయితపదులును లక్ష్మీకర గ్రాహులును దివాచంద్రికాకల్పశుద్ధాంతస్త్రీకులు నగురాజేంద్రులు సహితము స్వప్నమున గూడఁ బుట్ట కుండఁగాఁ గాల మనుసముద్రమున నానారాజన్యఘాటీమరుత్ప్రహారంబున కోడి తప్పు చుండిన కవులకావ్యము లన నేమి నిమగ్నప్రాయములు గా కుండునా? ఇట్టి దశలో వేలకొలఁదిసంవత్సరములక్రిందటఁ దమకీర్తులఁ దేశస్తంభములవలె నాఁటిన మహాకవులకావ్యరత్నములు వెలువడుట మనభాగ్యము కాని వేఱు గాదు. ద్రవిడకర్ణాటాంధ్రభాషలలో నానాప్రాచీనకావ్యములు ద్రవ్వి యెత్తఁబడుచున్నవి. అయినను దత్తద్రత్నముల ధరించువారు మాత్రము కొందఱే యై యున్నారు. సంస్కృతభాషా సరస్వతి నాదరించువారు సకలదేశములందును బ్రభవిల్లుచున్నందునఁ దదపూర్వగ్రంథముల యన్వేషణపరిశ్రమము ఫలవంత మగు నేని మనమందఱము నాదరింపవలసినదే. బుహ్లారు, పెటర్సన్, దుర్గాప్రసాదాదిమహాశయులు చేసినభాషోపకార మిట్టి దని వర్ణింపఁ జాల. చాణక్యునియర్థశాస్త్రము, బార్హస్పత్యసూత్రావళి, మొద లగుప్రాచీనశాస్త్ర గ్రంథములు కాలసముద్రమున దృష్టికిఁ దప్పినవి కూడ లభించినవి గదా! ఇప్పుడు కాళిదాసాదిమహాకవులకు స్తోత్రపాత్రు డగుభాసమహాకవినాటకములు చదువువారి వెదకు చున్న పనఁగా నింతకంటె నిప్పుడు మేలివార్త యే మున్నది?

“భాసుఁ డెవ్వఁడు? ఏకాలమువాఁడు? వానిగ్రంథము లేవి? సమగ్రములా? నేను వానిఁ జూడఁ గలనా” యని యొక్కొక్కఁడును విచారింపక తక్కఁడు. ఈవిషయమై యించుక దీనిలో వ్రాయఁ గోరుచున్నాను. బిల్హణరత్నాకరాదికవి కావ్యములు కాశ్మీరమున లభించెను. బుద్ధచరితాదులు నేపాళదేశలక్ష్మి యొసంగెను. హేమచంద్రాదికృతులు లాటదేశ మనుగనిలో నెత్తిరి. జినసేనాదులగ్రంథములు మహారాష్ట్రభండారములలో నుండెను గదా! ఇఁకఁ జోళపాండ్యాదు లేమి సేసె?

హిందూస్థానమున కెల్ల నొకమూల యయి గ్రంథాన్వేషకులకుఁ దిరస్కారభూతే మగు కేరళదేశముననే యీమహాకవినాటకములు పదిమూఁడును లభించుట యీదేశమునఁ బాండిత్యము పూర్వ మిట్టిదిశయం దుండిన దనియు సర్వసంహర్త లగుపరరాజుల ధాటివలన మలయత్రికూటమహేంద్రములు కేరళలక్ష్మిం గాపాడె ననియు నుద్ఘోషించు చున్నది. తిరువాన్కూరుమహారాజుల యౌదార్యాతిశయముచేఁ బ్రచురింపఁబడు సంస్కృతగ్రంథములలో నివియు వెడలుచుండుట లోకు లెఱుఁగుదురు గాక! తద్రాజనియుక్తులును జతుశ్శాస్త్రపండితులును గవులు నగుశ్రీమద్గణపతిశాస్త్రులవారు దేశ మెల్లఁ దాళపత్రగ్రంథముల వెదకుచు నొకసంపుటమున వీని నెల్లఁ గనుఁగొనిరి. రత్నములు లభించుట యాశ్చర్యము కాదు కాని సుస్థానమునఁ బడుటయే భాగ్య విశేషము. ఇప్పుడు లభించి యుండునవి పదిమూఁడురూపకములు.

1. స్వప్నవాసవదత్తము
2. ప్రతిజ్ఞాయౌగంధరాయణము
3. అవిమారకము
4. పంచరాత్రము
5. దూతఘటోత్కచము
6. మధ్యమవ్యాయోగము
7. కర్ణభారము
8. దరిద్రచారుదత్తము
9. ప్రతిమానాటకము
10. అభిషేకనాటకము
11. ఊరుభంగము
12. బాలచరితము
13. అనామకనాటకము.

వీనిలో రెండుమూఁడు నేను స్థలాంతరముల సంపాదించి తెనిఁగించి యుంటిని. వీనిలో దేనియందును గ్రంథకర్తృకృతిపతినామములుఁ గానరావు. ప్రాచీనకవుల నామములును జేర్కొనఁబడ వయ్యె. వీని నెవ్వరు రచించిరి యనుశంకయే మొదటఁ గలుగును. ఈవిషయమున నేను జెప్పఁబోవునంశము లన్నియు నవిరళముగా నతిమనోజ్ఞరచనావిశేషముతో శ్రీమద్గణపతిశాస్త్రులవారే స్వప్నవాసవదత్తపీఠికలోఁ గూర్చియున్నారు. చర్వితచర్వణ మైనను వారిశ్రమమునే నే నిందుఁ గైకొని యాంధ్ర మండలమునకుఁ జూపెట్టెదను. ఈనాటకములలోఁ బ్రస్తావన యనుటకు మాఱుగా స్థాపన యనునామ ముపయోగింపఁబడినది. సూత్రధారుఁడు మొదటఁ బ్రవేశించి దేవతాస్తుతిని జెప్పును. రెండురూపకముల మాత్రమే నటీపారిపార్శ్వకులు ప్రవేశింతురు. తక్కినవానిలో నెల్ల సూత్రధారుఁడే పాత్రప్రవేశము సూచించును. బాణుఁడు హర్షచరితమున,

సూత్రధారకృతారంభై ర్నాటకై ర్బహుభూమికైః
సపతాకై ర్యశో లేభే భాసో దేవకులై రివ.

అని చెప్పియున్నాఁడు. భాసుఁడు సూత్రధారకృతారంభము లగురూపకముల రచించె నని భావము గదా. ఈపదిమూఁడునాటకములు శోధింపఁగాఁ బదబంధమును రచనాధోరణియు, అర్థవైశద్యమును, అన్వయసౌలభ్యమును సమానములై యుండుటయె కాక సామాన్యవాక్యశ్లోకములు పెక్కులు గానవచ్చు చున్నవి. మఱియు విద్యాపరిపాకమునను నాధ్యాత్మికసంస్కారమునను గ్రంథకర్త యొక్కఁడే యని నిస్సంశయముగా గానవచ్చు చున్నాఁడు. వీనిలో స్వప్నవాసవదత్తమును రాజశేఖరుఁడు భాసనాటకమని పేర్కొనెను.

“భాసనాటకచక్రే తు ఛేకే క్షిప్తే పరీక్షితుం
స్వప్నవాసవదత్తస్య దాహకోభూ న్న పావకః” అని

రూపకముల నన్నిటిఁ బరికింపఁగాఁ దత్కర్త కాళిదాసభవభూతులకంటె నెందును దీసినవాఁడు కాఁడని కంఠోక్తిగాఁ జెప్పవచ్చును. మఱియుఁ గవిప్రాచీనతయు శైలిచేతనె కాక లక్షణగ్రంథోదాహృతపద్యములచేతనుఁ దెలియఁగలదు. స్వప్నవాసవదత్తకర్త యగుభాసుఁడే తక్కినవియు రచించి యుండు నని సిద్ధాంతము చేయఁ దగును. కాకుండెనా రాజశేఖరకవి పొరపడి యుండవలయు. భాసుఁడు గాకుండినఁ గాళిదాసాదులు మెచ్చఁ గలకవి యెవ్వఁడో యగుఁ గాక. కాళిదాసు మాళవికాగ్నిమిత్రమునఁ “బ్రథితయశసాం భాససౌమిల్లకకవిపుత్రాదీనాం” అని భాసాదుల విదితయశస్కులుగాఁ బేర్కొనెను. ఈరూపకములు సుమారు ౧౨ నూఱుల సంవత్సరములకుఁ బూర్వమే లోకమున విరళప్రచారము లయ్యె. మమ్మటాదు లొకశ్లోక మైన నుదాహరించినవారు కారు. అభినవగుప్తపాదులు నాట్యవేదవివృతి యనుభారతీయవ్యాఖ్యానమునఁ గొన్ని భాసశ్లోకము లుదాహరించిరి. వామనుఁడు కొన్నిటి నుదాహరించె. భామహుఁ డనుచాలఁబ్రాచీనాలంకారికుఁడు తనకావ్యాలంకారమునఁ జతుర్థపరిచ్ఛేదమునఁ బ్రతిజ్ఞాయౌగంధరాయణములోని కొంతకథాభాగమును విమర్శించి యగూఢముగా నధిక్షేపించెను. చాణక్యుఁ డర్థశాస్త్రమున సేనాపతులు భటులరణశిరమున నూల్కొలుపుటకుఁ గా వీరవార్తలఁ బలికి రణప్రచారమశ్వమేధఫలదాయక మని యొత్తి చెప్పి వేదములలోని ప్రమాణములఁ జూపి ప్రాచీనకవులట్లు గూడఁ జెప్పుదు రని యొకపద్య ముదాహరించి యుద్ధకార్యనిర్వహణము సాగించుకొనవలయు నని యాదేశించుచు నొకపద్య ముదాహరించెను.

''నవంశరావం సలిలై స్సుపూర్ణం
సుసంస్కృతం దర్భకృతోత్తరీయం
తత్తస్య మాభూ న్నరకం స గచ్ఛే
ద్యో భర్తృపిండస్య కృతే న యుధ్యేత్''॥ అని

ఈశ్లోకము ప్రతిజ్ఞాయౌగంధరాయణమున నాల్గవయంకమున నున్నది. కావున నిక్కవి చాణక్యునికంటెఁ బూర్వుఁ డని వేఱ చెప్ప నక్కఱ లేదు. చాణక్యుఁడు క్రీ-శ-పూ-320లో నుండె నని యెల్లరకు విదితమే. మఱియు రాజశేఖరునికవిస్తోత్రమున నీక్రిందిశ్లోకమునఁ గవులకాలము నిర్ధారితమై యున్నది. దీనిలో మఱియు ద్వంద్వ సమాసమునఁ జేర్కొనఁబడినకవులు సమకాలికు లనియు నూహింపఁ దగును.

''భాసో రామిళ సోమిళౌ వరరుచిః శ్రీసాహసాంకః కవి
ర్మేంఠో భారవి కాళిదాస తరళా బంధుః సుబంధు శ్చ యః
దండీ బాణ దివాకరౌ గణపతిః కాంత శ్చ రత్నాకరః'' అని.

వీరిలో భాసుఁడే మొదటివాఁడు. వరరుచికిం బూర్వుఁడు. రామిళసోమిళులు గలసి శూద్రకరాజచరిత్ర రచించిరి. మేంఠుఁడు హయగ్రీవవధ విరచించెను. దివాకరుఁడు మాలవాఁ డని యొకానొకరు చిత్రముగాఁ జెప్పిరి గాని యది నిక్కము కాదు. గణపతి మహామోద మనుకావ్యమును రచించెను. మఱియు రూపకములఁ గడపట భరతవాక్యముల,

''ఇమాం సాగరపర్యంతాం హిమవద్వింధ్యకుండలాం
మహీ మేకాతపత్రాంకాం రాజసింహః ప్రశాస్తు నః'' అనియు
''భవం త్వరజసో గావః పరచక్రం ప్రశామ్య తు
ఇమా మపి మహీం కృత్స్నాం రాజసింహః ప్రశాస్తు నః''

అనియు నున్నది. ఒకవేళ రాజసింహుఁ డనురాజేంద్రునియాస్థానమున భాసుఁ డుండెనా యనుసందేహము కలుగుచున్నది. భాసరూపకములలో నవంత్యుత్తరకురుదేశ పరిచయము మెండుగాఁ గానవచ్చుచున్నది. రాజసింహుఁ డనురా జుజ్జయినీనరేం ద్రుఁడో యని సంశయము నాకుఁ గలదు గాని శాసనాద్యాధారము లింకను స్పష్టముగా నగపడవు. అర్థశాస్త్రపరిశోధకులు చాణక్యుఁడే తద్గ్రంథకర్త యని సిద్ధాంతీకరించిరి.

బాబానాన కీశ్వరప్రేమచే ననుప్రాణితుఁడయి మిగుల నుత్సాహముతో సత్యధర్మమును బ్రచారము చేయ నారంభించెను. విశ్వమయుఁడగుభగవానునియొక్క యాశ్చర్య మగుమహిమను జూచి నానాకు ధన్యుఁడయ్యెను. ఆతనిచే నీశ్వరునికొఱకు రచియింపఁబడిన హారతియొక్కభావ మిదియ:— "హే పరబ్రహ్మ! పరమేశ్వరా! గగనరూప మగుపళ్లెరమున రవిచంద్రు లనెడిరెండుదీపముల నుంచి తారకావళు లనఁ బరగెడిముక్తసరులతో శోభాయమాన మగుచుండ, సుగంధమలయానిలము నీకు ధూప మగుచుండ, మఱియు పవనుఁడు చామరములు వీవ, వనరాజి యుజ్జ్వలపుష్పములు ప్రదానము చేయ, హే భవఖండనహరీ! నీ కెటువంటియారతి జరుగుచున్నయది! అనాహతశబ్దము లన్నియు భేరీలవలె మ్రోయుచున్నవి. నీకు సహస్రనయనము లున్నను నయనహీనుఁడ వయి, సహస్రమూర్తు లుండియు, మూర్తిహీనుఁడ వయి, సహస్రపదము లుండియు, పాదహీనుఁడ వయి, గంధహీనుఁడ వయ్యును, సుగంధయుతుఁడ వయి, యున్నాఁడవు. ఏమి నీయొక్క మనోహరచరిత్రము!

ఎచ్చట ప్రకాశ మున్నను అది యాతనిజ్యోతియే. ఆతనియొక్క ప్రకాశము చేతనే యన్నియు ప్రకాశితము లగుచున్నవి. గురుసాక్షాత్కార మయిన నీజ్యోతి ప్రకాశిత మగును. సాధకులారా! మీ రెప్పు డాతనిని భక్తితోఁ గొల్తురో, అప్పుడే యాతనికి హారతి యగును. నాయొక్క మనసు హరిచరణారవిందముయొక్క మకరందముచే ముగ్ధ మగుచున్నయది. అహర్నిశము నే నాతనికొఱకే దప్పిక గొనియున్నాఁడ. నానా కనెడిచాతక మెల్లపుడును నీయొక్క నామమునందే నిత్యవాసము చేయునటుల నీకృపావారిని వర్షింపుము''

రసస్వరూపుఁడగునీశ్వరుని నానకు ధ్యానము చేయఁ జేయ నాతనిహృదయ మీశ్వరప్రేమచే రసపూరిత మయి యొప్పుచుండు. ఆతఁడు నిష్కాపట్యము గల శిశువువలెఁ గోమలహృదయుఁడు. ఆతఁడు దేశయాత్ర చేయుకాలమున బిడ్డలను సమీపించినపుడు వారలతోఁ దానును బిడ్డవలెఁ గలసియాడుచుఁ బాడుచుండెడివాఁడని వాడుక. సన్యాసివేషముతో నానాకు మతప్రచారార్థము బయలువెడలినపుడు విపాశా (Bias) నదీతీరమున 'క్రోడీరా' యనుపేరు గలయొకధనికులసంతానముతో నాతనికిఁ బరిచయము కల్గెను. నానాకునియొక్క యలౌకికభావమునకు వారు ముగ్ధు లయి యాపుణ్యపురుషునిపాదములకు మ్రొక్కి భక్తిని జూపిరి. అది మొదలు వారు నానాకుని సంతోషపెట్టుటకై యేపని నిర్వహించుట కైనను వెనుకంజ వేసినవారు కారు.

వారు నానాకునికై విపాశానదీతీరమున నొకనగరమును గట్టించి యిచ్చిరి. దానికి నానాకునియాదేశానుసారమున 'కర్తార్పూరు' అనెడినామ మిడఁబడినది. ఈనగరము పిదప శిఖులచేఁ బవిత్రముగ నెన్నఁబడి యొకప్రసిద్ధ మయినతీర్థయాత్రాస్థలముగ మారినది. ఈస్థలమునందే యిప్పటికిని 'సహజాద' అనఁబడు నానాకునియొక్క వంశస్థులు వాసము చేయుచున్నారు.

నానాకు నానాదేశములను పరిభ్రమణము చేసి స్వగృహమునకుఁ దిరిగి వచ్చెను. అప్పుడు సన్యాసివేషమును బరిత్యాగము చేసి మరల గృహస్థధర్మము నవలంబించెను. అతఁడు "కొరానునందును, పురాణములందును, శాస్త్రములందును ఈశ్వరుఁడు లేఁడు; ధర్మశాస్త్రప్రణేత లందఱును నీశాస్త్రములలోఁ దమతమపాండిత్యమునే ప్రకటన చేసికొనిరి. శాస్త్రము లన్నియు భ్రమతోఁ గూడికొని యున్నవి. భగవానుని పొందవలయు నన్న సంసారత్యాగము చేసి సన్యాసి గావలసినయగత్యము లేదు. మన యొక్క ప్రతిదైనిక జీవనమునందును నీశ్వరుఁ డుండియే యున్నాఁడు. పర్వతగహ్వరములయం దుండెడికఠోరయోగులును, రాజప్రాసాదములందు నివసించెడిధనవంతులును, ఇరుతెగలవారును నీశ్వరునికి సమానులే. ఎవ రేయేజాతికి సంబంధించినవారో యను విషయమును గూర్చి యాతఁ డెప్పుడును సంధానము చేయఁడు; కాని యెవరు సంసారమునందుఁ బ్రవేశించి యేరీతిని వ్యవహరించుచుందురో, దానిని మాత్రమే కనిపెట్టుచుండును" అని యుపదేశించుచుండెడివాఁడు. హిందూమతమునందు సహితము గార్హస్థ ధర్మ మెప్పుడును ధర్మజీవనమునకు ప్రతిబంధకము గాదనియే యీక్రింద వివరించిన శ్రీమద్భాగవతమునందలిపద్యములనుండి మనము గ్రహింపవచ్చును.

చ. అరయ గృహస్థు లయ్యును మహర్పితకర్మలు నస్మదీయసుం
దరచరితామృతశ్రవణతత్పరమానసయాతయాములున్
సరసగుణాఢ్యులై తనరుసాధుల కీగృహము ల్దలంప దు
ష్కరభవబంధహేతువులు గావు నృపాలతనూజ యెన్నఁడున్. ౪ స్కంధము.

చ. అనుపమవేదవేదు లగునంచితయోగిజనానుగీయమా
ననిజకథాసముత్సుకుఁ డనం దగునేను మదీయులందు నూ
తనముగ నుందుఁ గావున నుదారత వారికి నీగృహావళుల్
ఘనభవబంధహేతువులు గా విది యంతయు నిక్క మారయన్. ౪ స్కంధము.

మొత్తముమీద నానాకునిధర్మబోధము, హిందూసంఘమునందలి మూర్తిపూజ, జాతిభేదము మొదలుగాఁ గల కుసంస్కారములను రూపు మాపి, యుత్కృష్ట మయిన పరిశుద్ధాస్తికధర్మమును నెలకొల్పుటకును, మహమ్మదీయులయేకేశ్వరవాదము నొప్పుకొనుచు వారిచేఁ గావింపఁబడుచుండెడి గోహత్యాది యధర్మకృత్యములను ఖండించుచు రెండుసంఘములవారిని పరబ్రహ్మోపాసనమునందుఁ బ్రవిష్టు లగునటుల చేయుటకును నుద్దేశింపఁబడిన దగుటచే నానాకు తనయావచ్ఛక్తియుక్తులను సన్మతస్థాపనమునకై మరణకాలపర్యంతము వినియోగపఱచుచు వచ్చెను.

నానాకు బాగ్దాదునగరమునకు వెళ్లి యుండినప్పు డచ్చట మహమ్మదీయులనందఱిని యుపాసనమునకు నాహ్వానము చేయుమంత్రమును మార్చి సర్వధర్మములవారును నొక్కస్థలమునందే చేరి యుపాసించుటకై యన్నిమతస్థులకును నన్వయించునట్లు లందఱిని నాహ్వానము చేసెను. అందుపై నానగరమునందలి మసీదులోనిప్రధానముల్లాలకును (ఆచార్యులు, లేక యుపదేశకులు) నానాకునకును వాదప్రతివాదములు జరిగెను. అప్పుడు నానాకు ముల్లాతో నిట్లనెను:—"భూలోకమునందును స్వర్గలోకమునందును నెవఁడు నిత్యకాలమును విరాజిల్లుచున్నాడో, ఆయేకమేవాద్వితీయుఁ డగుపరమేశ్వరు నొక్కనినే నేను స్వీకరింతును. మఱి యేసంప్రదాయమునకు సంబంధించిన దేవతను నే నొప్పుకొనను" నానాకుయొక్క మతసారము నీక్రిందియుపదేశమునుండి తెలిసికొనవగును:—"లక్షలకొలఁది మహమ్మదులును, కోట్లకొలఁది బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులును సహస్రసంఖ్యాకు లగు రాములును, కృష్ణులును, ఆమహాపురుషుని (పరబ్రహ్మము) మందిరద్వారమునఁ గనిపెట్టుకొని యున్నారు. వీ రందఱకును వినాశము కలదు. ఏకమాత్రుఁ డగు నాపరబ్రహ్మ మొక్కఁడే అవినశ్వరుఁడు. అందఱును నాతనియొక్క గుణగానము చేయుచున్నా రనుట నిజమే కాని వారివారిమతములను గుఱించియే యొండొరులలో విరోధము ప్రబలుటను జూచి యయినను వారు సిగ్గు వహించుట లేదు. దీనివలన మనకుఁ దెలియున దేమన, ద్వేషభావము గలవా రందఱును సంకీర్ణభావము గలవా రయి సాంప్రదాయిక (Sectarian) పిశాచముచే నొట్టువడిరనియే. ఎవనికి న్యాయనిష్ఠ గలదో వాఁడే నిజ మయినహిందువు; ఎవనికి పవిత్రహృదయము గలదో వాఁడే నిజ మయినముసల్మానుఁడు."

బాబానానాకు హిందూముసల్మానుధర్మములను సమన్వయము చేసి, మతవైషమ్యములచేఁ గలహించుకొనుచుండిన యిరుసంఘములవారి నీశ్వరోపాసనచే బంధింప నెంచుటయే యాతనిసార్వభౌమిక (Universal) సాధన మై యుండెను. ప్రతిదేశమునందును సమయోచితము లగుమార్పులను గలుగఁజేసి శాంతిరాహిత్యు లగుమానవులకు జ్ఞానబోధము చేసి, ధర్మమును పునఃస్థాపనము చేయునిమిత్తమై యీశ్వరుఁడు తనయొక్క శక్తిని విశేషరూపముగ సుస్థాపితము చేయుచుండును. పంజాబుదేశమునందు ముఖ్యముగను, ఉత్తరహిందూస్థానమునం దంతటను, మహమ్మదీయరాజ్యములు స్థాపింపఁబడి, ముసల్మానుసంఘములు మనభారతవర్షమున స్థిరముగా నివాసము చేసికొన మొదలుపెట్టినది మొదలు ప్రతిమార్పులతో మునిఁగియుండిన హిందువులకును, నేవిధమైనరూపమును గాని యీశ్వరునికిఁ గల్పించుట కలవాటు పడనిముసల్మానులకును ఘోరసంగ్రామము తటస్థించెను. ఈశ్వరునిమంగళోద్దేశమును మనపవిత్రభారతవర్షము కేవలము హిందువులకు మాత్రమే గాక సోదరముసల్మానులకును నండ గావలసివచ్చుటచే వారును భారతమాతగర్భముననే యుండి మనకు సోదరు లయిరి. హిందువు లింక ముసల్మానులను సోదరులవలె భావించి యాలింగనము చేసికొని హిందూముసల్మానుసోదరులు 'అలఖ్ నిరంజనుని' పితృత్వమును స్వీకరింపవలసి యుండెఁ గాని, ఒండొరులతోఁ గలహించుకొని మాతృభూమిని పరులపాలు చేయుట కది యదనుగా కుండెను. కావున నీశ్వరునిచేఁ బ్రేరేపితుఁడై బాబానానా కాసమయమున నుద్భవించి హిందూముసల్మానుల ధర్మతత్త్వములను గ్రహించి యామతద్వయమునందలిసార మొక్కటిగ నుండుటను దెలిసికొని, హిందూమహమ్మదీయమతములం దవివఱకే ప్రవేశించినదురాచారములను మాత్రము తూలనాడి యిరుతెగలవారిని స్నేహపాశమునఁ గట్టివేయుటకుఁ బ్రయత్నించెను. "ఈశ్వరుఁ డొక్కఁడు, మనుష్యు లందఱు సోదరతుల్యులు" అనునదియే యామహనీయునిమూలవాక్యము. దానినే యాతఁడు తన శిష్యత్వమున కొప్పుకొనినవారి కందఱకు నుపదేశించెను. ఇదియే యాతనిచే స్థాపింపఁబడి కాలక్రమమున నిరుపమానతేజస్సును, అపూర్వసహనమును, అనన్యసామాన్య మగుస్వార్థత్యాగమును జూపినశీఖ్ ధర్మమునొక్క బీజమంత్రము. ఆతఁడు తన్ను మృత్యుశీలుఁ డనియును, పరమపాపి యనియు దలంచుచుండెడివాఁడు. సర్వశక్తిమంతుఁడును, స్వయంభువును, స్వప్రకాశుఁడును నైనపరబ్రహ్మమునందు విశ్వాస ముంచుటయే ముక్తిని బొందుటకు సరియైనమార్గ మని బోధించుచుండెడివాఁడు. ఆతఁడు ఆదిగ్రంథమునం దీవిధముగ వ్రాసెను:—

“మానవుడు కొరానును గాని వేదమును గాని పఠించి తాత్కాలికానందమును బొంద వచ్చును, కాని యీశ్వరుని బొందనియెడల నాతని కెప్పుడును ముక్తి లభించదు.” అలౌకికక్రియలను చేసి చూపి యెవరినిగాని యెప్పుడును నాతఁడు మోసపుచ్చ లేదు. కాని యాతనిచే నలౌకికక్రియ లనేకములు జరుపఁబడినట్టు లాతనిశిష్యు లనేకులచే నమ్మఁబడుచున్నవి. ఒకానొకసమయమున నెవరో యాతని నొకయలౌకికకార్యమును జేసి చూపుమనినపు డాతఁడు “నాకు కేవలము పవిత్రమయినమతమును గుఱించి మాత్రము తెలియును గాని మఱి యేదియుఁ దెలియదు. ఈశ్వరుఁ డొక్కఁడే సత్యస్వరూపుఁడు, మిగిలిన దంతయు నస్థిర” మని చెప్పెను.

అంత్యదినములలో నాతఁడు సపరివారముగ విపాశానదీతీరమునందలి కర్తార్పురమున నివసించుచుండెడివాఁడు. అప్పుడు నానాస్థలములనుండియు ననేకులు వచ్చి యాతనికి శిష్యు లగుచుండెడివారు. ఆతనియేకాంతధర్మనిష్ఠకును మధురసంభాషణమునకును, సరళసౌజన్యభావమునకును నాతని సమీపించినవా రందఱును మోహితు లగుచుండెడివారు. ఆతఁడు హిందువుల కుపదేశించునపుడు వేదములనుండియు, మహమ్మదీయులతోఁ బ్రసంగించునపుడు కొరానునుండియు శ్లోకములను జదివి వినుపించుచుండెడివాఁడు. ఈవిధముగ భక్తసమాగమముచే కర్తారుపుర మొకతీర్థయాత్రాస్థల మైనది. అచ్చటికి నందఱును గుంపులుగుంపుగా వచ్చి శాంతిని బొందుచుండెడివారు.

నానాకునిసహచరులలో మర్దానా బాలసింధుల గుఱించి యిదివఱకే చెప్పఁబడియున్నది. తుంగగ్రామమునుండి రామదా సనెడి మఱియొకగొల్లవాఁడు పయిత మాతని సహచరవర్గములోఁ జేరెను. నానాకుని యాశ్చర్య మైనశక్తిచేతను, భావముచేతను ముగ్ధుఁ డై యాతఁడు నానాకునితోఁ జిరకాలానుగతుఁ డయ్యెను. రామదా సందఱికంటెను వయస్సునం దధికుఁ డగుటచే వానిని ‘బుడ్ఢా,’ యని పిలుచుచుండెడివారు. నానాకునిసహచరులలో ‘లాహినా’ సర్వశ్రేష్ఠుఁడు. శ్రద్ధాభక్తియందును, ధర్మజీవనమునందును నాతఁ డందఱికంటెను నధికుఁ డని తెలిసికొని నానాకు ఆతనిని పుత్రునికంటె నెక్కువగఁ బ్రేమించుచుండెడివాఁడు. నానాకు పరలోకగతుఁ డగుటకుఁ బూర్వ మీ ‘లాహినా’ నే ‘గురుఅంగద’ అనునామముతోఁ దనస్థానమున నియోగించెను. ‘లాహినా’ క్షత్రియవంశీయుఁడు. ఆతఁ డొకపర్వకాలమున కాంగ్రా యనుప్రదేశమునకు విగ్రహదర్శనార్థమై పోవుచు మార్గమున నానాకును గలిసికొనెను.

కుని సుమధురధర్మసంభాషణమును విని యాతఁడు నానాకునిశిష్యు
ను. నానాకు చాలకాలము మతప్రచారము చేయుచు డెబ్బదియొక
ున, క్రీస్తుశకము 1529 సంవత్సరమున ఆశ్వయుజశుద్ధదశమినాఁడు
ణము చేసెను.

సంక్షిప్త జీవితమునందు బాబానానాకునిధర్మోపదేశములను వ్రాయఁ
. ఆంధ్రపాఠకప్రపంచము నానాకును గుఱించి యెక్కువ తెలి
మయినటుల నాకు స్ఫురించెనేని బాబానానాకునిజీవితమునే సవిస్త
దలచుకొన్నాఁడను. ఈశ్వరుఁడు ఆంధ్రులమనంబుల నానాకుపంటిభక్
ఁ జేయునుగాక!

ఓం శాంతిః, శాంతిః, శాంతిః.

# మూఁడవప్రకరణము

## ప్రకృతి

గతప్రకరణములయందు దేవునిఁగూర్చియు మానవునిఁగూర్చియు విపులముగా వ్రాసి యుండుటచేఁ బ్రకృతినిగుఱించి యిందు విశేషముగా వివరింపవలసినయావశ్యకత ముండదు. బ్రాహ్మమతప్రకార మీలోకమునందలిసకలమునకును దేవుఁడే యాదికారణుఁడు; అతఁడే మూలాధారుఁడు. అందుచేఁ బ్రకృతియు, భూమ్యాకాశములును నతనిసృష్టియై యున్నవి. మనోహరమైనయీజగత్తు నంతయుఁ గలుగఁ జేసి, కాలగతికి విడిచిపెట్టి భగవంతుఁడు నిర్వ్యాపారుఁడై యొకచోఁ గూరుచుండ లేదని యింతకు ముందే తెలిసికొనియున్నారము. శక్తిస్వరూపుఁడై యతఁడీవిశ్వమునందంతటను వ్యాపించి యున్నవాఁడు. ప్రతిపదార్థాణువును, ప్రతిజీవాణువును నా మహామహునిమహిమనే యుద్ఘోషించుచున్నవి. అతఁడు లేనిచో నెద్దియు నీలోకములో నొకనిమేషమైన నుండఁజాలదు.

శ్లో॥ కో హ్యేవాన్యాత్ కః ప్రాణ్యాత్ యదేష ఆకాశ ఆనన్దో నస్యాత్

[తైత్తిరీయము]

[అర్థము:—ఆనందరూపుఁడయినపరమాత్మ బయలున లేకున్న నెవఁడు చలించును? ఎవఁడు జీవించును?]

శ్లో॥ భయాదస్యాగ్ని స్తపతి భయా త్తపతి సూర్యః
భయా దిన్ద్రశ్చ మృత్యుర్ధావతి పఞ్చమః [కఠము]

[అర్థము:—ఆపరమేశ్వరునియొక్క భయమువలన అగ్ని వేఁడిమి నిచ్చుచున్నది. ఆతనిభయమువలన సూర్యుఁడు ఉష్ణము నిచ్చుచున్నాఁడు. మేఘము, వాయువు, అయిదవది యైనమరణము నాతనిభీతివలన నడచుచున్నవి.]

భగవంతుఁడీరీతిగా సర్వవ్యాపకుఁడై యుండ, నిందునకు వ్యతిరిక్తములైన రెండువిధములగునభిప్రాయములు జనులలో నల్లుకొని యున్నవి. ఇం దొకటి దేవుఁడు విశ్వమునుండి వేఱుగా నున్నాఁడనునది; మఱియొకటి విశ్వమే దేవుఁడనునది.

ఈద్వివిధము లైనమతములలో దేనితోడను బ్రాహ్మమత మేకీభవింపఁ జాలదు. మనోజ్ఞ మైనప్రకృతియందనారతము బ్రహ్మమును వీక్షించుటచే మనపూర్వులు ప్రకృతీశ్వరులకు గలభేదమును బాటింప లేకపోయిరి. మనభరతఖండములో నీయభిప్రాయమునకు నెక్కువ వ్యాపకము గలదు. విశ్వమునందలి ప్రతితృణమునందును, ప్రతిజీవాణువు నందును భగవన్మహిమ కానవచ్చుచున్నను, భగవంతునియందే సమస్తవిశ్వమును విశ్వము నందు భగవంతుని మనము దర్శింపఁ గలిగినను, నీవిశ్వము లెన్ని గలిపినను భగవంతుఁ డెన్నటికిని గానేరఁడు. ఎల్లపదార్థములయం దంతర్భూతుఁ డై ప్రతిక్షణమునందును చిత్రవిచిత్రము లైనమార్పుల నెన్నియో యతఁడు కలిగించుచున్నను, నతఁ డీలోకమున కతీతుఁ డై మన మూహింప నలవి గానియనంతకోటిబ్రహ్మాండముల సృష్టించి పరిపాలింప సమర్థుఁ డై యున్నాఁడు.

ఈరీతిన యోజించితిమేని మృతపదార్థ మని మనము ప్రకృతిని నిరాకరించుటకు వీలు లేదు. అందుఁ బని సేయుచున్నశక్తు లన్నియు నంధము లని తృణీకరించుటకును వలనుపడదు. సృష్టియందలిప్రతిశక్తియు ప్రపంచాభివృద్ధికై యుద్దేశింపఁబడిన దై నిరంతరాయముగా నడచుచున్నది. రమణీయ మైనయీప్రకృతి యీశ్వరునియనల్ప కల్పనాచాతుర్యమును జాటెడుమహాదేవాలయము. అతఁడే దీనిని గాపాడుచు ననునిమిషమును తదభివృద్ధికై కృషి సేయుచున్నాఁడు. సృష్టి యంతయు నియామకము లైనకొన్నిశాశ్వతధర్మముల ననుసరించి వర్తిల్లుచున్నది. మార్పు లేక కలకాల మొకే తీరున నడచుచుండెడునీధర్మములకు ప్రకృతిశాస్త్రజ్ఞులు ప్రకృతిధర్మము లని పేరు పెట్టిరి.

ఈధర్మములు సర్వకాలములయందును సర్వదేశములయందును నొకేవిధమునఁ బ్రవర్తించుచున్నవి. అందువలననే జ్యోతిశ్శాస్త్రజ్ఞుఁడు ఖగోళమండలమునందలిగ్రహ నక్షత్రములయొక్క గమనమును దెలిసికొని గ్రహణము లెప్పుడు గలుగునో నిర్ణయింపఁ గలుగుచున్నాఁడు; రసవాదశాస్త్రజ్ఞుఁడు వస్తుతత్వమును గ్రహించి యేయేపదార్థములను మిశ్రమము చేసిన నేయేనూతనపదార్థము లేర్పడునో స్పష్టముగాఁ జెప్పఁగలుగుచున్నాఁడు.

అట్లే యొకయంత్రకారుఁడును నీధర్మముల నాధారము చేసికొని నానావిధ యంత్రములను నిర్మింపఁ గలుగుచున్నాఁడు. ఈప్రకృతిధర్మములు పక్షపాతము లేక ధనవంతులవిషయమునను, దరిద్రులవిషయమునను, పండితులయెడలను, పామరులయెడలను నొక్కవిధముగానె వర్తించుచున్నవి. విషమును పాపాత్ముఁడు మ్రింగినను, పుణ్యాత్ముఁడు మ్రింగినను ప్రాణమును గోల్పోవుచున్నాఁడు. తుపాను వచ్చినప్పుడు దొంగ లెక్కిన నావ యైనను దొర లెక్కిననావ యైనను మునిఁగిపోవుచున్నది.

చాలకాలమునుండి యిట్లు మార్పు లేక జరగుచుండుటచే నీవిశ్వము తనంతటనే నడచుచున్న దనియు, దీనిని నడపునట్టివాఁ డెవ్వఁడును లేఁ డనియుఁ గొందఱు భావించుచున్నారు. ఇట్టియభిప్రాయమునకుఁ గారణము లేకపోలేదు. స్వాతంత్రబుద్ధి సంపద గలమానవు లొకతీరున నడచుకొనక పరిపరివిధములఁ బ్రవర్తించుచుండుటచే సర్వస్వాతంత్రుఁ డగుపరమేశ్వరుఁడు గూడ నిట్లె యుండు నని వా రూహించుచున్నారు. కొంచె మాలోచించినచో నీయభిప్రాయము సరి గా దని మనకుఁ దోఁప గలదు. మనుష్య లోకపద్ధతిప్రకారము నడచుకొనకపోవుటకుఁ గారణము, వారియజ్ఞానమును దూరాలోచనరాహిత్యము గాని వారిబుద్ధిస్వాతంత్ర్యము గాదు. అసంపూర్ణజ్ఞానము గలవా రగుటచే మనుజులు తమకార్యగతులను సాంతముగా గ్రహింప లేక నడుమనడుమ మార్పులను జేసికొనవలసినవా రగుచున్నారు. నిలుకడ లేక తనకార్యములలో మాటి మాటికి మార్పులు చేయువానిని మన మస్థిరచిత్తుఁ డని సామాన్యముగాఁ జులకన చేయుచుందుము. మాఱుపు లేక చాలకాలము చక్కఁగా వ్యాపారము చేయువానిని మనము బుద్ధిమంతుఁ డనియు, యోచనాపరుఁ డనియుఁ గొండాడుచుందుము. అగతానాగతవేది యగుసర్వేశ్వరుఁ డీవిశ్వముయొక్క ప్రవర్తనమును గూర్చి ముందుగా నాలోచించి యిప్పటివఱకును నేమార్పును లేక యొక్కచందముననే నడపుచున్నచో, దీని నాతఁడు వదలి యూరకుండె నని యూహించుటకు నావశ్యకము లేదు. భగవంతుఁ డీజగత్పరిపాలనమునం దనుసరించుపద్ధతులే గదా ప్రకృతిధర్మములు! అనంతకాలస్థాయి

పర్యాయము నిర్ణయించి యుండుటయుఁ దత్ప్రకార మింతవఱకు నిరంతరాయముగా జరగించుచుండుటయు నాసృష్టికర్తయొక్క బుద్ధికౌశలమునకుఁ బ్రబలనిదర్శనముగా నున్నవి. ఏనియమూలమున నీప్రకృతి మొదల నిర్మింపఁబడెనో, యానియమూలముననే యది యింతదనుక నిపుణముగా నడపఁబడుచున్నది.

భగవంతుఁడే దయాపరుఁడైనచోఁ దనయేర్పాటుల నప్పుడప్పుడు మనుజుల లాభమునిమిత్తమై మార్చికొనవలసియుండు నని కొందఱు భావించుచున్నారు. కాని కొంచె మాలోచించినచో నీయభిప్రాయముయొక్క లోపము తేటతెల్లము గాఁగలదు. వస్తువులయొక్క స్వభావ మొక్కతీరున నుండక మాటిమాటికి మాఱుచుండెనేని మన మేకార్యమును జేయుటకు వీలుండఁ జాలదు. సూర్యుఁ డొకనాఁడు తూర్పుదిక్కునను మఱియొకనాఁడు పడమటిదిక్కునను నుదయించి, చంద్రుఁ డొకప్పుడు వెన్నెలను మఱియొకప్పుడు వేఁడిమిని నిచ్చినచో, ప్రపంచమున కెంత యుపద్రవము గలుగునో యూహించుకొనుఁడు. ఒకేపదార్థ మొకసమయమున ప్రాణపోషణమునకును, మఱియొక సమయమున ప్రాణనాశనమునకును గారణ మైనచో నెట్లుండునో తలపోయుఁడు. కార్యకారణసంబంధము లేక పనులు జరగుచుండెనేని జగత్తంతయు తాఱుమాఱగు ననుట సంశయము లేదు. తనయిచ్చ వచ్చినట్లు నిరంకుశముగాఁ బ్రకృతిని నడపుచుండెడు భగవంతుని బుద్ధిమంతు లగుమానవు లెవ్వరును బూజింపఁ జాలరు. అంతియే గాక యట్టిప్రపంచములో నివసించుటయుఁ బ్రయాసకరముగానే యుండును. జ్ఞానమయుఁడును, కరుణాళుఁడు నగుపరమేశ్వరుఁ డాతీరుగా వర్తించు నని యెంచుటకు నావంతైన నవకాశము లేదు. ప్రకృతియందలిధర్మముల నిట్లు భగవంతునిపరిపాలనామార్గములుగా భావించి గౌరవించుచుండుటచే మతమునకును బ్రకృతిశాస్త్రమునకును గలవైరమును బ్రాహ్మమతము తీర్చినది. ప్రకృతిశాస్త్రవేత్తలపరిశోధనలవలన స్థాపింపఁబడుప్రతిధర్మమును బరమేశ్వరునిమహిమమును వృద్ధిపఱచుచు, మనకు నూతనజ్ఞానమును బ్రసాదించుచున్నది. ఈరీతి చూడఁగాఁ బ్రకృతిశాస్త్రము మతమునకు సహకారియే గాని వైరి గాదు. సృష్టియందుఁ గలిగెడుమార్పులయొక్క తత్త్వమును బరిశోధించుభారమును

ప్రకృతిశాస్త్రజ్ఞులకు వదలి తత్పరిశోధనాఫలితములుగా నేర్పడువిషయముల నీశ్వరమహిమను వెల్లడించెడు సత్యములనుగా బ్రాహ్మమతము స్వీకరించుచున్నది.

విశ్వమంతయు నొకకాలమందు తాఱుమాఱుగాను వికారముగాను నుండి యంతకంత కాస్థితి మాఱిపోయిన దనియు, కీటకాదిక్షుద్రజంతువు లొకప్పుడీభూతలముమీఁద వాసముచేయుచుండి యవి రాను రాను నున్నతము లైనప్రాణిసముదాయమునకుఁ జోటియ్య సాగె ననియు ప్రకృతిశాస్త్రజ్ఞులు నిరూపించియున్నారు. సహేతుకమైనయీసిద్ధాంతానుసారముగాఁ బ్రకృతి యేర్పడె నని యొప్పుకొనినచో నొక మతము ప్రపంచ మాఱుదినములలో సృష్టింపఁబడిన దని బోధించినను, మఱియొకటి యాఱువేలసంవత్సరములలో సృజింపఁబడిన దని నుడివినను బ్రాహ్మసమాజమునకు సమానమె.

ఒక్కయినుకరేణువును గాంచినను, ఒక్కజీవాణువును వీక్షించినను, ఒక్కచరిత్రాంశమును బరిశీలించినను, అపార మైనజ్ఞానమును, అనంత మైనకారుణ్యమును, అకలంక మైన సద్భావమును బొడగట్టుచున్నవి. అపరిమితమేధాసంపన్నుఁడును, దయాసముద్రుఁడు నగుభగవంతునిసంబంధముచేతఁ గాక యట్టిప్రశస్తగుణము లావస్తుగణమునం దెట్లు కానఁబడఁ గలవు? ఆబుద్ధియు, ఆశక్తియు, ఆప్రేమయు మున్నెన్నఁడో యొకయుగమునందు, నేదో యొకప్రదేశమునందు మాత్రమే యుండెనని జనులు భావించిరి గాని యిప్పుడాయద్భుతగుణవిశేషములు ప్రతిస్థలమునందును, ప్రతిక్షణమునందును వ్యక్తము లగుచున్నట్లు గ్రహింపఁబడుచున్నవి. సర్వాంతర్యామి యైయాసకలకల్యాణగుణాకరుఁ డెల్లెడలఁ బ్రకాశించుచున్నాఁడు. అందుచే నీవిశాలవిశ్వమంతయుఁ బవిత్ర మైనబ్రహ్మమందిరము. లౌకికము పారమార్థిక మనుభేదము నశించి సర్వకార్యములును నీశ్వరప్రీతికరము లైనవి. సర్వప్రదేశములును బవిత్రము లైనవి. సర్వకాలములును బావనము లైనవి. ఇఁక వ్రేలెత్తి "యిచట దేవుఁడు లేఁ" డని యెక్కడఁ జూపఁ గలము?

ఆనందస్వరూపుఁ డగునీశ్వరుఁడు సర్వత్ర వ్యాపించియున్నాఁ డని భావించుటచే నీప్రపంచము సుఖబహుళ మనియు నివాసయోగ్యము గా దనియు మన మెంచుటకు

నవకాశము లేదు. మానవజీవితమును సకలప్రతిష్ఠాపనలును బవిత్రములు. ప్రపంచ మెన్నటికిని మిథ్య కానేరదు. మనజీవితము గూడ వట్టిమాయ గాదు. జీవితము ననుగ్రహించినందునకు మనము విచారపడుటకుఁ గాని యిట్టిమానవసంఘమును సృష్టించిన యీశ్వరునిబుద్ధికుశలతను శంకించుటకుఁ గాని యావశ్యకము లేదు. అనిర్వాచ్య మైన యానందము నొడఁగూర్చెడుకుటుంబమును సంఘమును మన కెన్నటికినిఁ ద్యాజ్యములు గావు. సమస్తానురాగములను బంధములఁగా నెంచుట కేవల మస్వాభావికమును, నీశ్వరాజ్ఞోల్లంఘము నై యున్నది. మన మొకమాయాజాలములోఁ దగుల్కొని యున్నామనియు, దీనినుండి తప్పించుకొనుటయే ముక్తి యనియుఁ దలంచుట భావ్యము గాదు. అట్లయినచోఁ గోట్లకొలఁది మానవుల నిట్టికష్టసంఘాతములచేఁ బీడించుచున్నవానిని మనము భగవంతుఁ డని పూజించుటకంటె పెనుభూత మని వెఱవవలసియుండును. ఈశ్వరశక్తికి భిన్న మైనమఱియేశక్తియు నీప్రపంచమునందు లే దని బ్రాహ్మసమాజముయొక్కనిశ్చితాభిప్రాయము. భగవంతునియుద్దేశమునకు వ్యతిరిక్తముగా వర్తింపఁ గలభూతపిశాచము లెవ్వియు లేమిచే నేయుపద్రవములకును మనము భయపడ వలసినపని లేదు. కరుణాకరుఁ డగుపరమేశ్వరుఁ డధిష్ఠానదేవత యగుటచే నీవిశ్వమును గారాగృహముగా నెంచఁ దగదు.

ప్రపంచము నొకచెఱసాలగాను, నిందలిసౌఖ్యములను దుచ్ఛములుగాను, నిందలి యనురాగములను సంకెళ్లగాను బోధించినవేదాంతమువలన సంఘమున కగణిత మైన యపకారము సంభవించెను. ఈవేదాంతసిద్ధాంతము భక్తిపరు లగుమహానుభావులను సంఘమునుండి దూరము చేసి సంఘమునకుఁ బనికిరానివారినిగా నొనరించెను. అట్లు ప్రేమలతలను దెంపుకొని విడిచిపోలేక మానవులలో మెలఁగుచుండినమహాభాగుల యొక్కజీవితములను మిగుల దుఃఖభాజనము చేసెను. ఇహలోకసౌఖ్యములయందు విముఖత్వమును గలిగించి సంఘాభివృద్ధికై పాటుపడెడుపరోపకారపారీణుల నడుగంటఁ జేసెను. ఇన్నివిధముల నష్టకారి యైనయాసిద్ధాంతమునందు జనులకు విశ్వాసము సన్నగిల్లిన గాని హైందవసంఘ మభివృద్ధిఁ బొందఁ జాలదు. మనము నివసించెడి యీభూమం

స్థలము మిక్కిలి యానందావహ మైనది. నిర్మల మైనయాత్మయె భగవంతుఁ డధివసించు స్వర్గము. మనగృహములే యీశ్వరాలయములందలిగర్భగృహములు. మనయభివృద్ధికొఱకే యీలోకమునందుఁ బ్రేమపూర్వకముగా సృజింపఁబడినారము. మనము నీతివంతుల మగునిమిత్తమే నయోపేత మైనయీవిశ్వమునందు మన మాపరమపావనమూర్తిచే నుంపఁబడితిమి. బ్రహ్మజ్ఞానమును బడయఁగోరెడువాతఁ డీప్రపంచమును వదలుటకంటె నిం దుండుటయే యావశ్యకము. విపత్తులకును, విధులకును, ప్రలోభనములకును, పోరాటములకును, గృహసౌఖ్యములకును, గృహచ్ఛిద్రములకును దావల మైనయీలోకమే మన మనుభవమూలకముగా నాధ్యాత్మికాభివృద్ధిఁ జెందుటకుఁ దగినపవిత్రస్థలము. బిడ్డలను తల్లిదండ్రులకును, భార్యకును భర్తకును, ఒకమనుష్యునకును మఱియొకమనుష్యునకును గలసహజానురాగమే మనల నానందపరవశులను జేయు నెడతెగనిమహాధూపమై యెచటఁ బరగుచుండునో, దుఃఖములును, బాధలును, రోగములును, మరణములును మనహృదయాంతరాళములయందు దయానుకంపముల నెచటఁ బ్రేరేపించుచుండునో, యోగులయొక్కయు, మహాభాగులయొక్కయు, ధీరులయొక్కయు, సదాచారులయొక్కయు సహవాసభాగ్యమున మనజీవితము లెచటఁబావనము లగుచుండునో, యట్టి మానవసమాజమునందుఁ గాక యంధకారబంధుర మగు నేపర్వతగుహాంతరమునందు, నేకాననమధ్యమందు మన మాపరబ్రహ్మముయొక్క దివ్యదర్శనము చేయఁ గలము? ఈలోకమునందు నెఱపవలసినవిధులనుండియు, ననుభవింపవలసినకష్టములనుండియుఁ, జించుకొని పాఱిపోవుటవలనఁ గాక యిం దుండి వాని నెల్ల ధైర్యముతోడను, భక్తితోడను, నిర్వహించి సహించుటమూలముననే, శక్త్యనుసారముగా మానవసేవ నాచరించుటమూలముననే మనము పరమేశ్వరునిఁ దెలిసికొనవలసియున్నది. ఘనకార్యములఁ జేసి కీర్తి గాంచకపోయినను, పలికినప్రతివచనమునందును, యోజించినప్రత్యాలోచనయందును, నొనరించినప్రతికార్యమునందును నిష్కపట మై, నిర్మల మైనసద్భావమును గనఁబఱతురేని యట్టిమనుజులు జీవితముయొక్క పరమార్థము నెఱిఁగినవా రనియు, వారిజీవితములు ధన్యము లైన వనియు నుడువుటకు లేశ మైనను సందేహము లేదు.

చేయఁగలదు.

శ్లో॥ లోకేశ చైతన్యమయాధిదేవ మాఙ్గల్య విష్ణో భవదాజ్ఞయైవ

హితాయ లోకస్య తవప్రియార్థం సంసారయాత్రామనువర్తయిష్యే॥

[అర్థము:—లోకములకు నియామకుఁడ వగునోపరమేశ్వరుఁడా! జ్ఞానస్వరూపుఁడ వగునోసర్వేశ్వరుఁడా! సర్వమును బొంది ప్రకాశించువాఁడ వగునోజగదీశ్వరుఁడా! మంగళభావము గలయోస్వామీ! వ్యాపకుఁడ వగునోపరమేశా! నీయాజ్ఞచేతనే ప్రపంచహితముకొఱకును, నీప్రియముకొఱకును నీసంసారయాత్ర ననుసరించుచున్నాను.]

## రామమోహనుఁడు పరమపదమున కేఁగుట.

1832వ సంవత్సరమున రామమోహనుఁడు ఫ్రాన్సు దేశమునకుఁ జని పెక్కుపరు లాదేశప్రభువును సందర్శించుటయె గాక యొకటిరెండుసారు లాతనితో విందు గూడ నారగించెను. 1833వ సంవత్సరప్రారంభమున నాతఁ డింగ్లాండు దేశమునకు మరల వచ్చి పార్లమెంటుసభలందు తనవిరోధులు సహగమనమును గూర్చి పంపినవిజ్ఞాపనము కొట్టివే యఁబడుట జూచి యానందించెను. ఈస్టిండియాకంపెనీవారికి మరల పట్టా నిచ్చునపుడు రామమోహనుఁ డాసభయం దుండి తనస్వదేశీయులకు కొన్నిహక్కులు కలుగునట్లు చేసెను. సెప్టెంబరునెలలో నాతఁడు విశ్రాంతిని బొందుటకై బ్రిస్టలునగరమునకుఁ జనెను. ఆతఁ డాపురము ప్రవేశించినకొలఁదిదినములకే యాతనిశరీరమునం దొకభయం కర మగురుగ్మత ప్రవేశింప, నానెల 27వ దివసమున నాతఁడు పరమపదమునకు వేంచే సెను. ఆతని కంత్యదినములయం దుపచారము చేసిన హేరుదొరసాని యాతఁడు ప్రాణ ములు విడుచునపుడు 'ఓం' అనుపదము నుచ్చరించినట్లు చెప్పుచున్నది.

రామమోహనునిభౌతికదేహము బ్రిస్టలుపురమున సమాధి చేయఁబడెను. ఆ సమాధిపై నాతనిస్నేహితుఁడును శిష్యుఁడు నయిన ద్వారకనాథటాగూరు తా నింగ్లాండు నకు వెళ్ళినప్పు డొకచక్కనిగోరీని కట్టించెను.

## రామమోహనునియనంతరము సమాజస్థితి.

రామమోహనుఁ డింగ్లాండు దేశమునకు జేగినపిదప నాతనిజ్యేష్ఠకుమారుఁ డయిన రాధాప్రసాదరాయి బాబుద్వారకనాథటాగూరునిసహాయమున సమాజమును జరపు చుండెను. తండ్రిమరణానంతరము ద్రవ్యవిషయ మైనకొన్నితగవు లుండుటచే రాధా ప్రసాదరాయి ఢిల్లీపురమునకుఁ బోవలసివచ్చెను. ఢిల్లీనుండి మరలి వచ్చినపిదప నాతఁడు సమాజమువిషయమై శ్రద్ధ తీసికొనుట మానివేసెను. సమాజకార్యములం దింతదనుక నత్యంతశ్రద్ధ వహించియున్న తారాచంద్రచక్రవర్తియు చంద్రశేఖరదేవుఁడును కలకత్తా పురమును వదలి బర్ద్వానుసంస్థానమున నుద్యోగములు సంపాదించుకొనిరి. రామమోహనుఁ డున్నకాలమున నాతనినిబట్టి యనేకులు సమాజమునకు వచ్చుచుండిరి. ఆతనియనంతరము క్రమముగా నొక్క రొక్కరే మానివేసిరి. కడకు బాబు ద్వారకనాథటాగూరును, రామమోహనునిస్నేహితుఁడును శిష్యుఁడు నగు పండిత రామచంద్రవిద్యావాగీశుఁడును

మిగిలిరి. సమాజమునకు ద్వారకనాథునిసంస్థానకార్యనిర్వాహకుఁడు నిర్వాహకుఁడుగను, పండితరామచంద్రవిద్యావాగీశుఁ డాచార్యుడుఁగ నుండిరి.

## రామమోహనునియుద్దేశములు.

రామమోహనునిచారిత్రమును ముగించుటకుఁ బూర్వ మాతఁ డెట్టి యుద్దేశములఁ గలిగి యుండెనో, యాతఁ డొనరించినకార్యములప్రధానలక్షణము లెవ్వియో తెలిసికొనఁ బ్రయత్నింతము. రామమోహనుఁ డనువదించినవేదాంతగ్రంథపీఠికయం దాతఁ డిట్లు వ్రాసియున్నాఁడు.

“హిందూసంఘముయొక్కయల్లిక నానాఁటికి విగ్రహారాధనచే నాశనము చేయఁబడుచున్న దనువిషయమును, స్వదేశీయులపై నాకుఁ గలయమితప్రేమయు, నిరంతరము నాతలఁపున నుండి, వారి నాయజ్ఞాననిద్రనుండి మేల్కొలుపుటకు నాశక్తికొలఁదిని పాటుపడునట్లు నన్ను బురికొల్పినవి.”

కాని వారిని మేల్కొలుపు టెట్లు? వారు మానసికముగను నాధ్యాత్మికముగను నీచమైనదాసినత్వమునకు లోనయి యుండిరి గాన నేవిధముగా బోధించినను వారియల్ప వివేకమునకును సామాన్యజ్ఞానమునకును తట్టదు. వారు తాము పట్టినకుందేటికి మూడే కాళ్ళని వాదించువా రగుటచే వారితో నెంత యుక్తియుక్తముగా వాదించినను నిష్ప్రయోజనమే. తాము పరిశుద్ధగ్రంథము లని తలఁచెడివేదములనుండి ప్రమాణములఁ జూపినఁగాని చెప్పెడిదానిపై వారు లక్ష్యమే యుంచరు. కావుననే రామమోహనుఁడు తత్వవిషయమై నిరాటంకముగా వారిచేఁ బ్రమాణగ్రంథము లని యామోదింపఁబడుచున్న వేదాంతగ్రంథములను దనకార్యసాధనమున కాధారముగాఁ గైకొనెను. వంగదేశమున విద్యతోఁ బాటు వేదాంతగ్రంథపఠనముఁ గూడ సన్నగిల్లెను. పండితు లని ప్రసిద్ధి వడసినవారియం దనేకుల కందలిసంగతు లివి యని తెలిసియె యుండవు. వాని ననువదించి ప్రకటించుటచే వారిమనంబు లాకర్షింపఁబడి ప్రస్తుత మనుచరణమునం దున్నవిగ్రహారాధనను శోధించుకొందు రని రామమోహనుఁడు నమ్మెను. కావుననే యాతఁడు కఠినమైనయాగ్రంథముల స్వభాషలో ననువదింపఁ బూనుకొని విశేషవ్యయప్రయాసములకు లోనయి వానిని బ్రచురించి యుచితముగాఁ బంచిపెట్టెను. ఇట్లు చేయుటచే వానినెల్లరు చదివి యందలియంశముల నరయుదు రని యాతఁడు నమ్మెను. ఈకారణముచేతనే కొన్నిఁటిని రెండుమూఁడుభాషలలోఁ గూడ బ్రచురించి యుండెను.

రామమోహనువిరోధుల కాలనిగ్రంథములు మిగుల విస్మయము గలిగించెను. వారనేకసంవత్సరములకుఁ బూర్వము మఱచిపోయినసంగతుల నాతఁడెందు ముచ్చటించి యుండెను. వారికి విగ్రహారాధనపై దురభిమానము మెండుగ నుండుటచే నెట్టియిన నది యాచరణీయ మని స్థిరపరుపవలె నని ప్రయత్నించిరి. రామమోహనుఁడు విగ్రహారాధన కూడ దని నిరూపింపఁ జూపినకారణములతోను ప్రమాణములతోను వారది కూడు నని వాదింపఁ బ్రయత్నించిరి.

విగ్రహారాధన యాచరణీయ మని వారు చూపినకారణములలో మొదటిది:—"మానవు లీశ్వరజ్ఞానమును బడయుటకుఁ బూర్వము వేదములందును స్మృతులందును విధింపఁబడినకర్మల నెంతమాత్ర మతిక్రమింపక యనుష్ఠించుట యగత్యము."

దీనికి రామమోహనుఁడు "ఈశ్వరజ్ఞానమును బొందుటకు శాస్త్రములందు విధింపఁ బడినవిధులును కర్మలును ననుష్ఠించుట యుక్త మని యంగీకరింతుము గాని కేవల మాకర్మములమూలముననే యీశ్వరజ్ఞానము సిద్ధించు ననియుఁ, దక్కినవేనివలనను సిద్ధింప దనియు జెప్పినచో మే మది యంగీకరింపఁ జాలము." అని చెప్పెను.

"అవాఙ్మానసగోచరుండును, అనంతశక్తియుతుండును నగు భగవంతునిగూర్చి జ్ఞానము సంపాదించుట దుస్సాధ్య మని యనేకశ్లోకములు మొఱ్ఱ పెట్టుచున్నవి." అని తమ రెండవకారణమును జెప్పిరి.

దానికి రామమోహనుఁడు "ఆవిషయమునుగూర్చి నేనును మీతో నామోదించు చున్నాను. భగవద్విషయమైన పరిపూర్ణజ్ఞానమును బొందుట నిశ్చయముగాఁ గష్టమును దుర్లభము నై యున్నది. గాని దురభిమానము విడిచి స్వబుద్ధి నుపయోగించుప్రతి మానవున కది యంతకష్ట మైనది గా దనియు, నాతఁడీసృష్టియందలి యాభగవంతుని యద్భుతకార్యముల వీక్షించి యాసర్వశక్తు నెఱుంగఁ గలఁ డనియు నొక్కి చెప్పఁ గల" నని జవా బిచ్చెను.

"ఈశ్వరకళ్యాణగుణముల ననేకవిధము లయిన ప్రమాణములమూలమునను పవిత్ర పదార్థములమూలమునను మానవకోటి యుపాసింపవలె నని శాస్త్రములు విధించుచున్న" వని తమమూఁడవకారణమును జెప్పిరి.

అందునకు రామమోహనుఁడు "ఈశ్వరకళ్యాణగుణముల ననేకవిధము లయినప్రతిమలమూలమునను పవిత్రపదార్థములమూలమునను మానవజాతి యుపాసింపవలె నని శాస్త్రములు విధించుచున్న వనువిషయమును నే నంగీకరింపఁ జాలను. ఏల నన శాస్త్రము లట్టియారాధనను అగోచరుఁ డైనయాభగవంతుని ధ్యానింప లేనిమూఢులకు మాత్రమే విధించుచున్న" వని బదులు చెప్పెను.

"ఎఱుఁగ నశక్య మగునట్టి దారాధింపఁబడ నేర" దని వారు తమనాల్గవకారణమును జూపిరి.

అందునకు రామమోహనుఁడు "ప్రకృతిని పరిపూర్ణముగా నెఱుంగుట గాని, పరమాత్మయొక్క గుణములఁ బూర్తిగా గ్రహించుట గాని, ఫలపుష్పపత్రభక్ష్యములతో నైవేద్యము నొందు దృగ్గోచర మగుబొమ్మ గాని యీశ్వరారాధనకు ప్రధానసాధనము లని మీరు దలఁచినయెడల, నప్పు డీశ్వరారాధన మసాధ్య మని నేను మీతో నేకీభవించెదను. అట్లు గాక, సర్వవ్యాపి యైనభగవంతుని నాతనియద్భుతకార్యములవలన నెఱుంగునట్టి యాత్మౌన్నత్యమును బడసి, మనయునికికిని సౌఖ్యమునకును జ్ఞానమునకును గారణ మైనయాతనియపారశక్తిని నిరంతరము మనకు స్వాభావిక మైనకృతజ్ఞతతో ధ్యానించుటయే యీశ్వరారాధనకు ప్రధానసాధన మని తలఁచినయెడల నీశ్వరారాధన నుసాధ్యమును అనుష్ఠేయమును మాత్రమే గాక వివేకము గలప్రతిమానవునకును విధి యని గూడ నొక్కి చెప్ప నెంతమాత్రము సందేహింప" నని బదులు చెప్పెను.

సమాజమున జరపఁబడుసాంఘికోపాసనావిధానమును వా రీరీతిగాఁ దప్పు పట్టిరి. "సభలు చేయుట, వాద్యములు వాయించుట, కీర్తనలు పాడుట, నృత్యము చేయుట, వీనిని శాస్త్రము లైహికవినోదములుగా గణించుచున్నవి గాని యాత్మపారిశుధ్యమునకు సాధనములుగా నెంచుట లేదు."

దానికి రామమోహనుఁడు "శాస్త్రములు ఈశ్వరారాధనయందు నృత్యము చేయ ననుజ్ఞ యిచ్చుట లే దనువిషయమును నే నంగీకరించుచున్నాను. కావున నే దానిని మాయుపాసనలందుఁ జేర్ప లేదు. కాని యీశ్వరోపాసనలందు నే నీశ్వరు నుతించుకీర్తనల పాడుటవిషయమై యాజ్ఞవల్క్యస్మృతిలోని మూడవయధ్యాయమునందలి

114-115 నూత్రములు చూచినయెడల విశదము కాఁగలదు. అందు శాస్త్రోక్తములయినగీతములు మాత్రమే గాక, పామరులచేఁ గూర్పఁ బడినపాటలు కూడ నీశ్వరారాధనయం దుపయోగింప నగు నని విధింపఁబడి యున్నది. ఎట్టిప్రయోజనకర మైన యభిప్రాయ మైనను సాధారణసంభాషణామూలమునకన్న సంగీతయుక్త మయినకీర్తనల రూపమున బోధించినపుడు హృదయమున కెక్కుడు రంజకముగా నుండు నను విషయ మెల్లరకు విశదమే'' యని యుత్తర మిచ్చెను.

“ వేదాంతశాస్త్రమును పఠించువలన భగవంతుఁ డొక్కఁడే శాశ్వతుఁ డనియు, ఆత్మ యాతనికంటె భిన్నము గా దనియు, ఈదృగ్గోచర మగుప్రపంచ మంతయు మాయచేతనే కల్పింపఁబడిన దనియు తెలిసికొనుచున్నా'' మని వారు మఱియొక కారణమును జూపిరి.

అందునకు రామమోహనుఁ డీరీతిగా జవాబు చెప్పెను. “ మాయ యనుపదమునకు ముఖ్యముగా సృష్టించుశక్తి యనియు, నాశక్తిచే సృజింపఁబడిన ప్రపంచ మనియు నర్థము. త్రాటిని జూచి పా మని భ్రమ పడినపుడు నిజముగా నది పాము గాక త్రాడే యగుటయు, పా మనునది వట్టిభ్రాంతి యగునట్టు లీప్రపంచ మంతయు వట్టిభ్రాంతియే గాని దీనికి స్వతంత్ర మయినయునికి లే దనియు, దానియునికికిఁ గారణము భగవంతుఁడే యనియు వేదాంతము చెప్పుచున్నది. సర్వము భగవంతుఁడే యనియు సర్వమునందును భగవంతుఁ డున్నాఁ డనియు భగవంతుఁడు తక్క అన్యపదార్థము మఱియొకటి లే దనియు చెప్పుచున్నది. ఇట్లు చెప్పుటచే యదార్థముగా నుండున దంతయు భగవంతునకే చెందిన దని వేదాంతముయొక్క భావము. కావుననే యాతఁడు సత్యవంతుఁడును శాశ్వతుఁడును సర్వవ్యాపియు నై యున్నాఁడు; ఆతనికి నన్యముగా నేవియు యదార్థమయినయునికిని పొంది యుండ లేదు. క్రైస్తవగ్రంథములందును సర్వము భగవంతుఁడు, సర్వమునందును భగవంతుఁ డున్నాఁ డనువాక్యములను జూచుచున్నాము. దానినిబట్టి కుండలు చాపలు మున్నగున వన్నియు భగవంతు లని వారియభిప్రాయము కా దని తెలఁచెదను. కావున నివి యన్నియు నాపరమాత్మయొక్క సర్వవ్యాపకత్వమును దెలియఁ జేయుచున్న వని నమ్ముచున్నాను.''

మఱియు నాతనిప్రతిపక్షులు " ఈశ్వరునిగూర్చి యదార్థజ్ఞానమును బడయుటకు గృహస్థాశ్రమ మనుకూల మైనదికాదు" అని వాదించిరి.

ఈశ్వరునిగూర్చి యదార్థజ్ఞానమును పొందుటకు గృహస్థాశ్రమమునందు వీలు గల దనియు మున్ను జనకుఁడు సమస్తభోగములతోఁ దులదూగు చుండియు యదార్థ మైనయీశ్వరజ్ఞానమును పొందె ననియు వారికి సమాధానము చెప్పుటయె గాక మత గ్రంథములనుండి నిదర్శనములఁ జూపుచు రామమోహనుఁడు బెంగాళీభాషయం దనేక కరపత్రములఁ బ్రచురించెను.

ఆకాలమునందు జనులు తమమతగ్రంథములనుండి ప్రమాణములఁ జూపినఁ గాని చెప్పిడిదానిపై లక్ష్య ముంచకుండి రనియు యుక్తియుక్తముగా నెంత చెప్పినను ప్రయోజనము లేకుండె ననియు నిదివఱలోనే చెప్పియుంటిమి. విగ్రహారాధనయొక్క లోపములను వెల్లడి చేసి యేకేశ్వరారాధనవలన ప్రయోజనములను బోధించుటకు రామమోహనుఁడు వేదాంతగ్రంథముల నాధారముగాఁ గైకొనెను. కాని వేదాంతము యొక్క సంఘవినాశకర మైనయభిప్రాయములును అద్వైతసిద్ధాంతములును జనులమనస్సులందు గాఢముగా నాటుకొనియుండుటచే వానిని సులభముగా నూడబెరుక శక్యము గా కుండెను. సామాన్యజనుల నుద్దేశించి స్థాపింపఁ దలచినయాతనినూతనమతవిధానములు వారి నాకర్షింపఁ జాలక కారణాంతరములచే హిందూమతమునందు నమ్మకము పోయిన కొందఱు విద్యావంతులను మాత్రమే యాకర్షింపఁ గలిగెను. రామమోహనుఁడు విద్యావంతుఁడును నధికారవంతుఁడును భాగ్యవంతుఁడు నై యుండెను. తొలుత నాతనిని వెంబడించినవా రంద ఱట్టివారుగనే యుండిరి. సామాన్యజనులు కలవరపెట్టఁబడి పురికొల్పఁబడిరి గాని సమాజమున కాకర్షింపఁబడ రైరి. ఇందునిమిత్తమయి వారికి గ్రాహ్యమగునట్లు స్వభాషయందు గ్రంథములఁ బ్రచురించుట తప్ప తదితరముగా నేమియు కృషి చేయఁబడ లేదు. మిక్కిలి పురాతన మైనట్టియు నెక్కుడు తత్వసంబంధ మైనట్టియు వేదాంతము ననుసరించి సమాజమును నిర్మింపఁ బ్రయత్నించుటచే సామాన్యజనుల నాతఁడు సమీపించి వారల సమాజమునఁ జేర్ప లేకపోయెను.

# మానవసేవ.

మత సంఘ పరిశ్రమ భాషావిషయములం జర్చించు

## సచిత్ర మాస పత్రిక.

రాజమహేంద్రవరము.

పత్రికాసంపాదకులు — నాళము కృష్ణారావు, సత్యవోలు అప్పారావు.

మ. గరిమన్ స్వర్గ మనేకభూషణము లై గన్పట్టుచందంబునన్
బరమాత్ముం డఖిలప్రపంచమయుఁడై భాసిల్లు గానన్ జరా
చరరూపోజ్జ్వలసర్వభూతములకున్ సంప్రీతి గావించుచున్
నిరతిన్ మానవసేవ సర్వజనముల్ నిత్యంబు సేయం దగున్.

భూమండలమున మనభరతఖండము తక్క తక్కిన దేశము లెల్ల నాగరికాగ్రగణ్యము లై సమస్తసౌఖ్యములతోఁ దులతూగుచు భూలోకస్వర్గములో యన భాసిల్లుచున్నవి. నిన్న మొన్నటివఱకును గన్నులు దెఱవని విదేశీయులు తమ గాఢనిద్రనుండి మేల్కాంచి యెక్కుపెట్టిన మహోన్నతదశ నందుచున్నారు.

అనేకశతాబ్దములకుఁ బూర్వమే లోకపూజ్యు లగు మహర్షులచేతను, జగద్విఖ్యాతయశు లగు చక్రవర్తులచేతను, దేశభక్తు లగుప్రజలచేతను ప్రకాశించుచు సకలలోకగురుపీఠమ నధిష్ఠించిన మన భరతవర్షము నేఁడు కళావిహీన మై యధఃపతితమగుచున్నది.

అశేషశేముషీధురంధరు లగు దేశబంధు లహోరాత్రములు శ్రమపడి సముపార్జించిన జ్యోతిశ్శాస్త్రము గగనకుసుమ మై [illegible] శాస్త్రములు మందున కైనఁ గానరా కున్నవి. శిల్పములు స్వల్పములు [illegible] చేతిపనులు చేజారిపోయినవి.

అజ్ఞానవ్యాధిగ్రస్త మై ప్రాణమా[illegible]నశిష్ట మై యున్న మనదేశ[illegible]ను సమయసముచితోపాయసిద్ధౌషధసేవనంబు[illegible] ఆరోగ్యయుక్తముగఁ జే[illegible]పయ కాల ముపేక్షించితి మేని యపాయము స[illegible]యార్యసన్తతమును సముద్ధరింపవలయును. మనయాచారముల సంస్కరించుకొనవలయును. సారస్వతము నుజ్జీవింపఁ జేయవలయును. ప్రకృతిశాస్త్రముల బలపరచుకొనవలయును.

ఇవ్విధమున మానవసేవ సేయవలయు ననియె యీ 'మానవసేవను' నెలకొల్పినారము. మానవసేవయె దేశసేవయు, దేశసేవయె యీశ్వరసేవయుఁ గావున దీనిం జేపట్టి మీపట్టినలెఁ బోషించుభారము మీపయిం బెట్టినారము.

64 పుటలను గలిగి, చిత్రపటశోభితమై విలసిల్లు నీపత్రిక సర్వజనసులభముగ నుండునట్లు సంవత్సరమునకు రు 3 లు మాత్రమె చందా నేర్పరచినారము. అభిమానులకు రు. 5 లు; పోషకులకు రు. 10 లు; రాజపోషకుల యాదరము వారి యనుగ్రహాధీనము.

RAJAHM[illegible]RY.

# మానవసేవాకార్యస్థానమున వెలకు దొరకు గ్రంథములు.

1. కబీరు.—(ఇందు చరిత్రాంశము వచనముగను, ఉపదేశములు పద్యములుగ నుండును.) అత్తిలి సూర్యనారాయణగారిచే రచియింపఁబడినది. 0—2—0

2. బంగాళాదుంప.—నిడదవోలు వేంకటరావుగారిచే రచియింపఁబడినది. 0—2—0

3. అగ్గిపెట్టెలయంత్రశాల.— కందుల శ్రీమన్నారాయణగారిచే రచియింపబడినది. 0—4—0

4. లోకపావనశతకము.— (ఇందలి పద్యములు భక్తిరసము నొలికించును) ఆదిపూడి సోమనాథరావుగారిచే రచింపబడినది. 0—2—0

5. కోటిలింగశతకము.— (రామలింగేశశతకము ననుసరించి వ్రాయబడినది. ఇందలిపద్యములు నీతిని దేశభక్తిని పురికొల్పును.) సత్యవోలు అప్పారావుగారిచే రచియింపబడినది. 0—3—0

6. స్త్రీలయెడ మనము గావించు పంచమహాపాతకములు. నాళము కృష్ణారావుగారిచే రచియింపబడినది. 0—1—0

7. వీరమతి:—(వీరరసప్రధాన మైన యేడంకముల నాటకము. ఇందు దేశాభిమానము, స్వార్థత్యాగము, స్త్రీసాహసము ప్రదర్శింపబడును.) మంగిపూడి వేంకటశర్మ, ముట్నూరి వేంకటసుబ్బారాయుడుగార్లచే రచియింపబడినది. 0—10—0

8. భారతీయసందేశము:— (స్వదేశాభిమానమును, విదేశయాత్రవలని ప్రయోజనములను వెల్లడించు నొక భాణము.) కవులకొండల వేంకటరావుగారిచే రచియింపబడినది. 0—i—6

9. భక్తితరంగిణి:—(ఇందు భగవద్భక్తి, దేశభక్తి, మానవసేవ మున్నగువాని గూర్చినపద్యములు గలవు) 0—2—0

# మానవసేవ

సీ. కడలేనియజ్ఞానజలధి దాటెడినావ, భావింప మానవసేవ సూవె
సదమలగుణరత్నసమితిఁ గూర్చెడుకోన, భావింప మానవసేవ సూవె
నిర్వాణనగరికి నిర్మలంబగుత్రోవ, భావింప మానవసేవ సూవె
నిఖిలవిద్యాగణీరుహంబులచేవ, భావింప మానవసేవ సూవె
గీ. ముదము లూరించుసర్వంపుఁబువ్వుతేన, యఖిలసుఖముల కాకర మైనక్రోవ
దేశపర మేశసేవలఁ దెల్పుత్రోవ, చింత సేయంగ మానవసేవ సూవె.
సీ. దేశాభివృద్ధికి దివ్యసాధన మేది? భావింప మానవసేవ కాదె!
పరమాత్ముఁ గనిపెట్టుభవ్యసాధన మేది? భావింప మానవసేవ కాదె!
విద్యల నెలకొల్పుకృషులసాధన మేది? భావింప మానవసేవ కాదె!
భాగ్యంబు లొనగూర్చుపరమసాధన మేది? భావింప మానవసేవ కాదె!
గీ. ఐకమత్యంబు ప్రబలించునట్టి దేది? ప్రజల నన్యోన్యమైత్రిని పఱచు నేది?
నిఖిలమతసామరస్యంబు నేర్పు నేది? చింతసేయంగ మానవసేవ కాదె!
సీ. రాజ్యాధికారులై ప్రజల నేలెడివారు, పరుల సేవించుచు బ్రతుకువారు
అతిభోగభాగ్యంబు లనుభవించెడువారు, తిరిప మెత్తుచు నూరఁ దిరుగువారు
విజ్ఞానవేత్తలై వెలయుచుండెడివారు, కాయకష్టంబున గడపువారు
యాత్రాశ్రమముఁ బూని యలరుచుండెడివారు, సంసారయాత్రను జరుపువారు
గీ. ఆర్యక్రైస్తవబౌద్ధ మహమ్మదీయ, వివిధమతములఁ జేపట్టి వెలయువారు
స్త్రీలు, పురుషులు, వృద్ధులు, బాలకులును, సేయఁ దగినది మానవసేవ కాదె!
సీ. క్రూరదురాచారఘోరకాంతారంబు భస్మీకృతము జేయుపావకంబు,
అజ్ఞాన మనియెడి యంధకారంబును సదమనంబుగఁ జేయు చందమామ,
దారిద్ర్య మనియెడి పారావారంబును దూరంబుగాఁ ద్రోలుమారుతంబు,
వర్ణభేదంబు లన్ బర్వతపంక్తుల గులగుల్లగాఁ జేయుకులిశధార,
స్వార్థపరతావ్యాధి కౌషధంబు, సోమరితనంబునకుఁ జెద్దనుత్తిపెట్టు
కష్టవారాశి దాటించుగట్టినావ, జగతి మానవసేవకు సాటి గలదె?